

హరినాథ దేవాలయం పక్క కోనేటిగడ్డకు వెళ్లే పురాతన మెట్ల దారి

మా గోడు ఎవరికీ పట్టదా..?

"మా గోడు ఎవ్వరికీ పట్టడం లేదు. దశాబ్దాలుగా దారి సమస్యతో అల్లాడుతున్నాం. వృద్ధులు, విద్యార్థులు, మహిళలు నదిని దాటాలంటే నానా ఇబ్బందులు పడుతున్నాం. రాయచోటి పట్టణంలోకి వెళ్లాలంటే నదిలో నుంచి మాకు దగ్గర దారి. అలా కాకుంటే చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది.. సమయం వృథాతో పాటు ఆటో చార్జీలు కూడా భారమవుతున్నాయి. ఎన్నికలు వచ్చినపుడు రాజకీయ నాయకులు మాకు మంచి మాటలు చెప్పి హామీలు గుప్పించి ఓట్లు దండుకుంటున్నారే కానీ అనంతరం మమ్మల్ని పట్టించుకోవడం లేదు. మాండవ్యనదిలో పైపులు వేసి ఏర్పాటు చేసిన తాత్కాలిక బ్రిడ్జి వరదలకు కొట్టుకుపోవడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. మాకు శాశ్వత దారి వసతి కల్పించాలి". ఇదీ.. రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని పాతరాయచోటిలో గల కోనేటిగడ్డ వాసుల దీనగాథ.


కోనేటి గడ్డ నుంచి రాయచోటి పట్టణంలోకి వచ్చేందుకు మాండవ్యనదిని దాటుతున్న ప్రజలు

- దశాబ్దాలుగా దారి సమస్యతో అల్లాడుతున్నాం
- బడికి వెళ్లాలంటే మాండవ్యనది దాటాల్సిందే
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, వృద్ధులు, మహిళలు
- ఇదీ పాతరాయచోటిలోని కోనేటి గడ్డ వాసుల దుస్థితి



రాయచోటిటౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రాయచోటిని, పాతరాయచోటిని వేరు చేస్తున్న మాండవ్యనది ఒడ్డున గల పాతరాయచోటిలోని భాగమైన కోనేటిగడ్డ వాసులు సరైన దారి లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. మాండవ్యనది వెంబడి ఉన్న కోనేటిగడ్డలో సుమారు 100 కుటుంబాలకుపైగా ప్రజలు జీవనం సాగిస్తున్నారు. వీరంతా ఉదయం నుంచి సాయంత్రం వరకు పట్టణంలో కూలి పనులతో పాటు ఆసుపత్రుల్లో, పాఠశాలల్లో, బేకరీల్లో, హోటల్స్‌లో పనిచేస్తూ కుటుంబాలను పోషించుకుంటూ కాలం వెల్లబుచ్చుతున్నారు. వీరు నిత్యం కోనేటిగడ్డ నుంచి రాయచోటి పట్టణంలోకి రావాలన్నా, ఆసుపత్రికి వెళ్లాలన్నా, బస్టాండుకు వెళ్లాలన్నా, పాఠశాలలకు విద్యార్థులు వెళ్లాలన్నా అత్యంత దగ్గర ఉన్న దారి మాండవ్యనదిలో నుంచి హరినాథ దేవాలయం పక్కనే ఉన్న మెట్ల దారి. అక్కడి నుంచి మెయిన్ రోడ్డులోకి వచ్చి పనులు ముగించుకుని తిరిగి అదే మెట్ల మార్గం మాండవ్య నది దాటి ఇంటికి వెళుతుంటారు. ఇక్కడ హరినాథ దేవాలయానికి పక్కగా ఉన్న దారిలో పాతకాలం నుంచి మెట్లు ఏర్పాటు చేసి పాతరాయచోటిలోకి వెళ్లేందుకు దారి సౌకర్యం ఉండేది. అధికారంలో ఏ ప్రభుత్వం ఉన్నా స్థానిక ప్రజల వినతి మేరకు నదికి అడ్డంగా సిమెంటు పైపులు ఏర్పాటు చేయడం దానిపైన రాళ్లు, మట్టి వేసి తాత్కాలిక దారిని చేసేవారు.

ఆ దారి గుండా నగం పాతరాయచోటి ప్రజలతో పాటు విద్యార్థులు, వృద్ధులు, మహిళలు రాయచోటి పట్టణంలోకి వచ్చి వారి పనులను చూసుకుని తిరిగి వెళ్లేవారు. అయితే గతంలో వచ్చిన వరదల కారణంగా మాండవ్యనదికి వరద నీరు రావడంతో తాత్కాలికంగా పైపులతో వేసిన రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో పాతరాయచోటితో పాటు కోనేటిగడ్డ ప్రజలు ఆ దారి గుండా వచ్చేందుకు నానా అగచాట్లు పడుతున్నారు. తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోవడంతో దారి మధ్యలో చిన్న చిన్న సిమెంటు దిమ్మెలు, విరిగిపోయిన విద్యుత్ స్తంభాలను వేసి వాటిపై నుంచి దాటుకుంటూ పట్టణంలోకి వస్తున్నారు. ఈ క్రమంలో ఉదయాన్నే ఆ దారి గుండా వచ్చే ఎంతోమంది విద్యార్థులు, వృద్ధులు, మహిళలు అదుపు తప్పి మురికినీటిలో పడి గాయపడ్డ సందర్భాలు కూడా ఉన్నాయి. అయితే వారి సమస్యను మున్సిపల్ అధికారులతో పాటు జిల్లా ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేదు. ఎందుకంటే పట్టణంలోని గాలివీడు రోడ్డులో సినిమా థియేటర్స్ ముందుభాగం నుంచి నదిపై బ్రిడ్జి ఏర్పాటు చేయడంతో అటుగా పాతరాయచోటికి రావడానికి దారి ఉంది. అంతేగాక పట్టణంలోని బ్రాహ్మణవీధిలో గల అమీర్ చిల్డ్రన్స్ హాస్పిటల్ పక్క నుంచి పాతరాయచోటి మీదుగా వరిగ వెళ్లే మార్గంలో కూడా మాండవ్య నదిపై అధికారులు బ్రిడ్జి ఏర్పాటు చేశారు. అయితే అటుగా వెళ్లాలంటే చాలా దూరం ప్రయాణించాల్సి వస్తోందని ఆటోలో వెళ్లాలన్నా, టౌన్‌లోకి పోవడానికి రూ.60 రూపాయలు, రావడానికి రూ.60 బాడుగ అడుగుతున్నారని, చాలా చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందని కోనేటిగడ్డ వాసులు వాపోతున్నారు. అది కూడా ఆటోలో వెళ్లాలన్నా హాస్పిటల్ సమీపంలోని బ్రిడ్జి పైకి పోవాల్సి వస్తుందని వారంటున్నారు. అలా కాకుండా కోనేటిగడ్డ నుంచి పది అడుగులు వేస్తే మాండవ్యనదికి అటువైపు గల హరినాథ దేవాలయం వద్దకు వెళ్లే పరిస్థితులు ఉన్నాయని వారంటున్నారు. హాస్పిటల్స్‌కే కాకుండా బస్టాండుకు, ఇతర అవసరాలకు, సరుకులకు, విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు అన్నింటికీ అత్యంత దగ్గరగా గల హరినాథ దేవాలయం నుంచి కోనేటిగడ్డకు వచ్చే పురాతన దారికి మరమ్మతులు చేయడమే కాకుండా శాశ్వత దారి ఏర్పాటు చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని కోనేటి గడ్డ వాసులు ప్రభుత్వాన్ని, జిల్లా ఉన్నతాధికారులను, మున్సిపల్ అధికారులను కోరుతున్నారు.


ఎలాగైనా దాటి వెళ్లాల్సిందే...

ఓట్ల సమయంలోనే మేము గుర్తుకు వస్తాం..



ప్రజాప్రతినిధులకు గానీ, అధికారులకు గానీ ఎన్నికల సమయంలోనే మేము గుర్తుకు వస్తాం. వచ్చిన ప్రతి ఒక్కరూ మీరంతా కలసికట్టుగా మా ప్రభుత్వానికి ఓట్లు వేయండి మేము గెలిచిన వెంటనే మీ సమస్యను పరిష్కరిస్తామని చెప్పి ఓట్లు వేయించుకుని పని జరిగాక మమ్మల్ని పట్టించుకోవడం లేదు. కొన్నేళ్లుగా మేము ఇలాగే ఇబ్బందులు పడుతూనే ఉన్నాం. ఎవరికీ మా గోడు పట్టడం లేదు. మాకు అనుకూలంగా హరినాథ దేవాలయం పక్కగా వెళ్లే దారికి మరమ్మతులు చేసి పుణ్యం కట్టుకోండి.

- ధనలక్ష్మి, కోనేటిగడ్డ, పాతరాయచోటి

శాశ్వత పరిష్కారం చూపండి..



కోనేటిగడ్డ వాసులకు పట్టణంలోకి వెళ్లేందుకు అత్యంత అనుకూలంగా ఉండే పురాతన దారి హరినాథ దేవాలయం. పక్కన ఉన్న మెట్ల మార్గాన్ని నదిలో శాశ్వత పరిష్కార మార్గాన్ని చూపండి. సిమెంటు పైపులు వేసి తాత్కాలిక మట్టి వేసి రోడ్డు ఏర్పాటు చేస్తున్నప్పటికీ వరదలు వచ్చిన ప్రతిసారి పైపులు, మట్టి రోడ్డు కొట్టుకుపోతోంది. ఫలితంగా వృద్ధులు, మహిళలు, విద్యార్థులు నది దాటాలంటే ఇబ్బందులు పడుతున్నాం. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి దారి సమస్యను తీర్చండి.

- నాగరాజ, కోనేటిగడ్డ, పాతరాయచోటి

ఫ్లెక్సీ ఏర్పాటుపై ఘర్షణ

- టీడీపీ కార్యకర్తలపై వైసీపీ నాయకుల దాడి
- నలుగురికి తీవ్ర గాయాలు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఫ్లెక్సీ ఏర్పాటు విషయంగా వైసీపీ, టీడీపీ నాయకుల మధ్య శుక్రవారం రాత్రి ఆవులపల్లెలో ఘర్షణ జరిగిందని మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు... మదనపల్లె మండలం మాలేపాడు పంచాయతీ ఆవులపల్లె, నలరాజుగానిపల్లెలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా అదే గ్రామంలోని టీడీపీ కార్యకర్త ఆర్.రమేష్‌నాయుడు పొలంలో జగన్‌మోహన్‌రెడ్డి ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుండగా వైసీపీ నాయకులను అడ్డుకుని మీ పొలంలో ఏర్పాటు చేసుకోండి అని చెప్పారు. పథకం ప్రకారం వైసీపీ నాయకులు బాణాలకిట్టు, కె.శ్రీనాథ్, కె.వెంకటరమణ వీరితో కలిసి 15 మంది కలిసి వేటకొడవళ్లతో, కర్రలతో మరణాయుధాలతో టీడీపీ కార్యకర్తలు ఆర్.చక్రపాణి (35), బి.వెంకటరమణ (35), ఆర్.రమేష్‌నాయుడు (32), బి.గణేష్ (22)లపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. బాధితులను కులుంబసభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి వైద్యం కోసం తరలించారు. ఇందులో తీవ్రంగా తలలకు గాయాలైన ఆర్.చక్రపాణి, బి.వెంకటరమణలు మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించగా గణేష్, ఆర్.రమేశ్‌నాయుడు మదనపల్లె ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు డీఎస్పీ తెలిపారు. గాయపడ్డ టీడీపీ కార్యకర్తలను తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాంచినబాబు పరామర్శించారు. ఈ సంఘటనను ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లామని, దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కాగా గాయపడిన టీడీపీ కార్యకర్తలను టీడీపీ యువనాయకుడు జునైద్ అక్బరీ టీడీపీ నాయకులతో కలిసి వెళ్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతన్న బాధితులను శనివారం పరామర్శించారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ జనరల్ సెక్రటరీ దొరస్వామినాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు దేవరింటి శ్రీనివాసులు, టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకుడు పఠాన్ ఖాదర్‌ఖాన్, రెడ్డిశేఖర్‌నాయుడు, షంషీర్, బి.రెడ్డిప్రసాద్, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు రాటకొండ గుర్రప్పనాయుడు, నియోజకవర్గ బీసీ సంఘ నాయకుడు నాగయ్య, స్టేట్ చేనేత నాయకుడు బొమ్మిశెట్టి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

కేసులు నమోదు చేస్తాం: డీఎస్పీ

టీడీపీ నాయకులపై దాడి చేసిన వైసీపీ నాయకులపై కేసు నమోదు చేస్తామని మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు తెలిపారు. శనివారం ఉదయం ఆయన మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో చికత్స పొందుతున్న టీడీపీ కార్యకర్త రమేష్‌నాయుడుతో మాట్లాడి జరిగిన సంఘటన వివారాలను తెలుసుకున్నారు. సంఘటనలో ఎంతమంది ఉన్నా విచారణ చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కేసు విచారణలో భాగంగా మాలేపాడు పంచాయతీ, ఆవులపల్లెకు తమ సిబ్బందితో వెళ్లి సంఘటన స్థలాన్ని డీఎస్పీ పరిశీలించారు. అక్కడ విచారణ చేపట్టి వివరాలను సేకరించారు.


క్షతగాత్రుడిని విచారిస్తున్న మదనపల్లె డీఎస్పీ కొండయ్య నాయుడు

మానవత్వం చాటుకున్న కలెక్టర్

- కిడ్నీ వ్యాధి బాధిత విద్యార్థినికి సాయం
- రూ.లక్ష చెక్కు అందజేత


విద్యార్థినికి చెక్కు అందిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి కలెక్టరేట్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మూత్రపిండాలు పనిచేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థినికి చికిత్స నిమిత్తం కలెక్టర్ చామకూరి శ్రీధర్ శనివారం లక్ష రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. నవంబరు 27న కేవీపల్లి ఆదర్శ పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. ఆ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని జి.జాహ్నవి రెండు కిడ్నీలు పనిచేయకపోవడంతో వారానికి మూడుసార్లు డయాలసిస్ చేసుకుంటున్న విషయం కలెక్టర్ దృష్టికి వచ్చింది. ఆ విద్యార్థిని ఆరోగ్యానికి సంబంధించిన పూర్తి వివరాలతో కలెక్టరేట్‌లో కలవాలని పాఠశాల ప్రిన్సిపాల్‌కు కలెక్టర్ సూచించారు. దీంతో శనివారం మధ్యాహ్నం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ యండపల్లి బాలాజీ, ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని జాహ్నవి, ఆమె తల్లి కాంతమ్మతో పాటు కలెక్టర్‌ను కలిసి ఆరోగ్య పరిస్థితిని వివరించారు. దీంతో తన వ్యక్తిగత నిధుల నుంచి లక్ష రూపాయల చెక్కును విద్యార్థిని జాహ్నవికి అందజేశారు. దీంతో విద్యార్థిని, ఆమె తల్లి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం కృతజ్ఞతలు తెలిపారు.

నాటుసారా తయారీపై ఉక్కుపాదం

- ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్



వాల్మీకిపురం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నాటుసారా తయారీ, విక్రయాలపై ఉక్కుపాదం దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు ఎక్సైజ్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ మధుసూదన్ తెలిపారు. శనివారం సర్కిల్ పరిధిలోని వాల్మీకిపురం మండలంలోని పలు ప్రాంతాలలో సిబ్బందితో కలిసి విస్తృత దాడులు చేశారు. మండలంలోని దిగువ మేకలవారిపల్లె సమీపంలోని అటవీ ప్రాంతంలో రహస్యంగా దాచిన 3600లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేసి తయారీ పరికరాలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాటుసారా విషయం లో ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బృందాలతో నిఘా పెట్టి చర్యలు తీసుకుంటున్నామ ని, అలాగే ఎక్కడైనా బెల్ట్‌షాపులు నిర్వహించినా కేసులు నమోదు చేస్తామన్నారు. ఇకపై నిత్యం దాడులు ముమ్మరం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ బీఎంపీపీ సీఐలు యల్లయ్య, సత్య శ్రీనివాస్, స్థానిక సీఐ లత, ఎస్ఐలు సుభాషిణి, శశిధర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆపన్నులకు అన్నసమర్పణ

- పాడుబడిన గుడులు, బడుల శుభ్రతపై ప్రత్యేక దృష్టి
- నిలువ నీడలేకున్నా.. సేవా కార్యక్రమాల్లో ముందుకు
- శ్రీసుమఖీ అన్నపూర్ణేశ్వరీ సేవా సమితి సభ్యుల సేవలు అసామాన్యం

6

ఉపాధిలో సిబ్బంది చేతివాటం

- నలుగురు ఫీల్డ్ అసిస్టెంట్లు, ఒక టెక్నికల్ అసిస్టెంట్ సస్పెన్షన్

పెద్దతిప్పసముద్రం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం నిధుల్లో చేతివాటం ప్రదర్శించిన నలుగురు ఫీల్డ్ అసిస్టెంట్లతో పాటు ఒక టెక్నికల్ అసిస్టెంట్‌ను విధుల నుంచి తొలగించినట్లు డ్వామా పీడీ వెంకటరత్నం తెలిపారు. శనివారం పీటీఎం మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. కార్యక్రమంలో పీడీతో పాటు ఏపీడీ మధుబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ 1-4-2023 నుంచి 31-4-2024 వరకు ఉపాధి హామీ పనుల్లో భాగంగా పెద్దతిప్పసముద్రంలో 20 గ్రామ పంచాయతీలకు కేటాయించిన 1650 పనులకు గాను రూ.8.77 కోట్లతో వివిధ పనులు చేపట్టామని తెలిపారు. ఆయా గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనులను 10 రోజులుగా సామాజిక తనిఖీ బృందం పరిశీలించిందని తెలిపారు. ఆయా గ్రామాల్లో ఉపాధి హామీలో చేసిన పనుల్లో సిబ్బంది చేతివాటం ప్రదర్శించిన తీరును క్షేత్రస్థాయిలో సామాజిక తనిఖీ బృందం నిర్ధారించడంతో నలుగురు ఫీల్డ్ అసిస్టెంట్లను, ఒక టెక్నికల్ అసిస్టెంట్‌ను తొలగించి వారి నుంచి రూ.6,07,199 రికవరీ చేయాలని ఆదేశించారు. విధుల నుంచి తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్లలో పీటీఎం, కాట్నగల్లు, టీ.సదుం, దేవప్పకోట గ్రామాల్లో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లతో పాటు టెక్నికల్ అసిస్టెంట్ శంకరను తొలగించినట్లు డ్వామా అధికారులు తెలిపారు.


పీటీఎం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సామాజిక తనిఖీ ప్రజావేదిక వివరాలను పరిశీలిస్తున్న డ్వామా అధికారులు

ఆపన్నులకు అన్నసమర్పణ

- పాడుబడిన గుడులు, బడుల శుభ్రతపై ప్రత్యేక దృష్టి
- నిలువ నీడలేకున్నా.. సేవా కార్యక్రమాల్లో ముందుకు
- శ్రీసుమఖీ అన్నపూర్ణేశ్వరీ సేవా సమితి సభ్యుల సేవలు అసామాన్యం


రుచికరమైన వంటకాలను పంపిణీ చేస్తున్న దృశ్యం


గుడిని శుభ్రం చేస్తున్న కమిటీ సభ్యురాలు

కడప కలెక్టరేట్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మంచితనం మానవత్వం వారి అభి మతం. పేదలన్నా, అనాధలన్నా, హాస్టల్ విద్యార్థులన్నా అక్కున చేర్చుకుంటారు. వారికి మంచి రుచికరమైన ఇంటి భోజనం అందించి కొసరి కొసరి వడ్డిస్తారు. అంతేకాదు జిల్లాలో మారుమూల గ్రామాల్లో, కొండలు గుట్టల్లో ప్రభుత్వ, ప్రజల ఆదరణకు నోచుకోలేని పురాతన దేవా లయాలను శుభ్రం చేస్తారు. ఆధ్యాత్మిక సేవల్లో తమవంతు సాయం అందించి, ఆపన్నులకు అన్నసమర్పణా చేస్తూ మానవతను చాటుతున్న అసామన్యులు శ్రీ సుమఖీ అన్నపూర్ణేశ్వరీ సేవా సమితి సభ్యులు. వీరంతా కడప కేంద్రంగా సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. కానీ వీరంతా జిల్లాలో పలు గ్రామాలకు చెందిన మనసున్న మంచి మనుషులు.

మూడేళ్ల కిందట ఐదుగురు సభ్యులతో..

అది కరోనా సమయం. మనుషుల్లో మానవత్వం మాయం అవుతున్న రోజులవి. ప్రంచమంతా ఈ వైరస్‌కు భయపడి ఇంటిగడప దాటి బయటకు అడుగు పెట్టలేని పరిస్థితి. ఒకపక్క కాలు కదపకుండా ప్రభుత్వం ఆంక్షలు.. మరోపక్క పనులు లేక ఎందరో పేదలు ఆకలితో అల్లాడారు. ఇలాంటి సంఘటనలు కళ్లారా చూసిన కడప శంకరాపురానికి చెందిన రామ్మూర్తి, పరమేశ్వరరెడ్డి, సుబ్రమణ్యం, దస్తగిరిరెడ్డిలను కలచి వేసింది. అనుకున్నదే తడవుగా తమ వంతుగా పేదలకు ఏదో ఒక సహాయం చేసి మానవత్వాన్ని చాటుకుందామని టీ తాగుతూ ఆ నలుగురు కూడబలుక్కుకున్నారు. తమకు తెలిసిన స్నేహితులు, బంధువుల వద్ద కరోనా విలయం, మనిషి జీవితంపై పడిన ప్రభావం గూర్చి వివరించడంతో పాటు ఏదో ఒకటి చేద్దామని సహకారం కోరగా వారు పట్టించుకోలేదు. మానవసేవే మాధవ సేవ అని బలంగా నమ్మిన వీరికి మైదుకూరుకు చెందిన లక్ష్మీదేవి నేను సైతం అంటూ తోడయ్యారు. ఇలా మూడేళ్ల కిందట ఐదుగురు సభ్యులతో సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. తమ దగ్గర ఉన్నంతలోనే పేదలకు, అనాధలకు అన్నసమర్పణ చేయడమే లక్ష్యంగా ముందుకు అడుగులు వేశారు.


పేదలకు వితరణ కోసం సిద్ధంగా ఉన్న దుప్పట్లు


గుడి-బడి శుభ్రతకు సిద్ధంగా ఉన్న కమిటీ సభ్యులు

వీరంతా సంపన్నులు, ఇన్‌కంటాక్స్ పేయర్స్ కానేకాదు. చిన్నపాటి వ్యాపారులు, ప్రైవేట్ కంపెనీలో 10-15 వేల నెల జీతగాళ్లే. ఇందులోనే ఇంటి ఖర్చులు పోను తాము చేసే కార్యక్రమానికి తలాకొంత వేసుకుంటూ అనుకున్న కార్యం గట్టెక్కించేలా ముందుకు సాగారు. తమ హీరో, నాయకుల పుట్టిన రోజుల నాడు పేదలకు, ఆసుపత్రుల్లో రోగులకు అరటి పండు, ఒక బ్రెడ్డు ముక్క ఇస్తేనే ఫొటోలకు ఫోజులిచ్చి పబ్లిసిటీ కోసం పాకులాడే రోజులివి. కానీ వీరి సేవలను పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం వీరికి తెలీదు. కేవలం వాట్సాప్ గ్రూపులో తమ కార్యక్రమాలను మిత్రులకు, శ్రేయోభిలాషులకు పంపి తృప్తి చెందుతారు. వీరి సేవల్లో నిజాయితీ ఉండటంతో మేము సైతం అంటూ జిల్లా నలు మూలల నుంచి శ్రీ సుమఖీ అన్నపూర్ణేశ్వరీ సమితిలో సభ్యులుగా చేరుతున్నారు. ఇందులో ఇప్పుడు దాదాపు 300 మంది ఉన్నారు. వీరంతా కుటుంబంలా మారి సేవా కార్యక్రమాలు చేస్తున్నారు.

కలసి పనిచేసేందుకు కార్యాలయమే లేదు

జిల్లాలో మూడేళ్ల కాలంలో అనాధలకు, హాస్టళ్లల్లో ఉన్న పేద విద్యార్థులకు చాలాసార్లు మృష్టాన్నభోజన సమర్పణ చేశారు. బెడ్‌షీట్లు, పండ్లు, వేసవిలో చల్లని మజ్జిగ పంపిణీ లాంటి దాదాపు 200కు పైగా కార్యక్రమాలు చేశారు. అందులో ఒక్కొక్క కార్యక్రమానికి రూ.5 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చు అయినా సరే ప్రతి నెలా క్రమం తప్పకుండా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ఒక కార్యక్రమం చేసే ముందు వాట్సాప్ గ్రూపులో సభ్యులకు తెలియజేస్తారు. అంతే మానవతావాదులంతా తలో చేయి వే స్తారు. అంతివ్వాలి.. ఇంతివ్వాలనే నిబంధన లేకుండా ఎవరికి తోచిన మేరకు సాయం అందించి ఆ కార్యాన్ని గట్టెక్కిస్తున్నారు.

ఇంతటి సేవా కార్యక్రమాలు చేస్తున్న వీరు కూర్చుని మాట్లాడుకునేందుకు జిల్లా కేంద్రంలో ఎలాంటి కార్యాలయం లేదు. వీరంతా కడపలోని పార్కుల్లో, టీకొట్ల వద్దనో కూర్చొని తాము చేయాల్సిన కార్యకలాపాలను గూర్చి చర్చించుకుంటారు. ఇటీవలనే నూతనంగా శ్రీ సుమఖీ అన్న పూర్ణేశ్వరీ సేవా సమితిని రిజిస్టర్ చేసుకున్నారు. తమ సమితికి జిల్లా కేంద్రంలో ప్రభుత్వం సొంత స్థలం ఇస్తే కార్యాలయం ఏర్పాటు చేసుకుని సేవలను మరింత విస్తరిస్తామని వీరు అంటున్నారు.

విద్య, ఆధ్యాత్మిక సేవలు విస్తరిస్తాం

పేదలకు, అనాధలకు, హాస్టల్ విద్యార్థులకు ఇంటి భోజనంలా అన్నసమర్పణ చేస్తున్నాం. ఇప్పటికే వృద్ధాశ్రమాలు, రిమ్స్ ఆసుపత్రికి వచ్చేవారికి, కార్తీక మాసంలో దేవాలయాల వద్ద అన్నసమర్పణ చేస్తున్నాం. పేదల విద్యకు అధిక ప్రాధాన్యతతో పాటు యువతను సన్మార్గంలో పెట్టేందుకు ఆధ్యాత్మికత వైపు నడిపించే ఆలోచనలో ఉన్నాం. విద్యను ప్రోత్సహించేలా సేవలను విస్తరించే ప్రయత్నం చేస్తున్నాం.

\- పరమేశ్వరరెడ్డి, జిల్లా అధ్యక్షుడు

స్థలం కేటాయిస్తే మరిన్ని సేవలు

పేదలకు, అనాధలకు స్వంత ఖర్చులతో సభ్యుల సహకారంతో అన్న సమర్పణ లాంటివి చేస్తున్నాం. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలనే సంకల్పంతో ఉన్నాం. ఐదుగురితో ప్రారంభమైన మా సేవలు, ఈ రోజు జిల్లాలో 300 మందికి చేరుకుంది. మేము సేవలను విస్తరించేందుకు, కలసి చర్చించుకునేందుకు కార్యాలయం లేదు. ప్రభుత్వం కొంత స్థలం కేటాయిస్తే మాసేవలను మరింత విస్తరిస్తాం.

\- రామమూర్తి, గౌరవాధ్యక్షుడు

గుడులు బడుల శుభ్రత పుణ్యకార్యం

పేదలకు భోజన సమర్పణ ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. ఆదరణకు నోచుకోని గుడులు బడులు పరిశుభ్రం చేయడం పుణ్య కార్యక్రమం. ఇలాంటి కార్యక్రమాలకు నాతో పాటు పిలిచిన వెంటనే 50 మందికి పైగా సభ్యులు రావడం, అందరు కలసి సేవా కార్యక్రమంలో పాలు పంచుకోవడం పూర్వజన్మ సుకృతం. శిధిలావస్థలో ఉన్న గుడుల శుభ్రత విషయంలో మమ్మల్ని సంప్రదిస్తే స్వంతఖర్చులతో వచ్చి శుభ్ర పరుస్తున్నాం.

\- మైదుకూరు లక్ష్మీదేవి, సంఘ ఉపాధ్యక్షురాలు

మండల స్థాయిలో సేవలు జరిగేలా కమిటీలు

మా సంస్థ ద్వారా పేదలకు చేతనైన సహాయం చేస్తున్నాం. గతంలో సేవలు సాగించాలంటే చాలా ఆర్థిక ఇబ్బందులు ఉండేవి. ఇప్పుడు ఉద్యోగులు, పదవీ విరమణ చేసిన వారు, చిన్న, పెద్ద వ్యాపారులు, సామాన్య కూలీలు, ప్రైవేట్ సంస్థ ఉద్యోగులు సహకారం అందిస్తున్నారు. సేవా కార్యక్రమాలు మండల, నియోజకవర్గ స్థాయిలో విస్తరించేలా కమిటీలు ఏర్పాటు చేస్తున్నాం.

\- సుబ్రమణ్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి

రేణిగుంట విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా కల్పించాలి

- కేంద్ర మంత్రులకు బీజేపీ ఇన్‌చార్జి వినతి


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా కల్పించాలని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడును కోడూరు బీజేపీ ఇన్‌చార్జి గడ్డం చంగ ల్రాజు ఢిల్లీలో వినతిపత్రం అందజేశారు. శనివారం ఫోన్ ద్వారా మాట్లాడుతూ రైల్వేకోడూరు, రాయచోటి, కడప, బద్వేలు తదితర ప్రాంతాల నుంచి కువైత్, ఖతార్, సౌదీ, బెహరిన్, దుబాయ్ తదితర దేశాలకు పొట్టకూటి కోసం వేలాది మంది వెళుతుంటారని కేంద్ర మంత్రులకు విన్నవించామని తెలిపారు. విమానయాన సహాయ మంత్రి మురళీధర్ మొహల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. రైల్వేకోడూరులో పలు రైళ్లు ఆగకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలపగా ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. రైల్వే సహాయ మంత్రి వి.సోమన్నకు కూడా వినతిపత్రం అందజేశామని తెలిపారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి సమస్యలపై కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్‌కు వినతిపత్రాన్ని సమర్పించామని తెలిపారు. కేంద్ర మంత్రులందరు సానుకూలంగా స్పందించారన్నారు. రేణిగుంట నుంచి కనెక్టింగ్ విమాన సర్వీసులు ప్రారంభించేందుకు ప్రణాళిక సిద్ధం అవుతుందన్నారు. రేణిగుంట నుంచి బెంగుళూరు, లేదా రేణిగుంట నుంచి హైద్రాబాద్ వెళ్లి అక్కడి నుంచి కువైట్‌కు వెళ్లేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు.

'పరీక్షా పే చర్చ'ను విజయవంతం చేద్దాం

రాయచోటిటౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పరీక్షా పే చర్చా-2025 కార్యక్రమం విజయవంతానికి జిల్లాలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, జూనియర్ కళాశాలల అధ్యాపకులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంఆర్ఎస్ అజయ్‌కుమార్‌బాబు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, కళాశాలల్లో 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఈ పరీక్షా పే చర్చా కార్యక్రమంలో భాగస్వాములను చేయాలన్నారు. విద్యాపరమైన సవాళ్లకు వినూత్న పరిష్కారాలను చర్చించడానికి దేశవ్యాప్తంగా పాల్గొనే వారిని ఎంపిక చేసి, వారిని ఈవెంట్‌లో ప్రశ్నలు అడగడానికి, ప్రధాన మంత్రితో నేరుగా ఇంటరాక్ట్ అయ్యే అవకాశం కల్పిస్తుందన్నారు. ఇందుకోసం ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 6 నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులు వారి తల్లిదండ్రులకు ఆహ్వానం పలుకుతు న్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ 2025 జనవరి 14వ తేదీ వరకు ఉంటుందన్నారు. కార్యక్రమానికి ఎంపికైన వారికి ఈ మెయిల్, ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం తెలియజేస్తారన్నారు. మరిన్ని వివరాల కోసం రాయచోటి డైట్ అధ్యాపకుడు ఎం. నాగరాజు (9000910805), అసదుల్లా (9440084715)లకు ఫోన్ చేసి సందేహాలుంటే తెలియజేయాలని తెలిపారు.

నాడు జిల్లా కోట.. నేడు శిథిలాల బాట

- మంత్రి రాకతో సిద్దవటం కోటకు పూర్వవైభవం వచ్చేనా...!
- నేడు మంత్రి కందుల దుర్గేశ్ రాక


పిచ్చిమొక్కలతో నిండిపోయిన కోట చుట్టూ ఉన్న కందకం


దెబ్బతిని శిథిలావస్థకు చేరుకున్న కోట గోడలు

సిద్దవటం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఒకనాటి జిల్లా కేంద్రమైన సిద్దవటం అంటే టక్కున గుర్తు వచ్చేది కోటే. అలనాటి సిద్దవటం కోట సంస్కృతీ, సంప్రదాయాలను, శిలాసంపదను నాటి ఔన్నత్యాన్ని అలనాటి రాచరికపు వ్యవస్థను ప్రతిబింబిస్తోంది. ఆనాడు దేశంలోనే ఎంతో గుర్తింపు పొందిన ఈ కోట సొగసులు నేడు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. అయినా పట్టించుకునేవారు కరయ్యారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మృతి చెందిన కౌలు రైతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం మంజూరు చేయడానికి పవన్‌కళ్యాణ్ సిద్దవటం వచ్చారు. అప్పట్లో సిద్దవటం కోటను అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఆ హామీలో భాగంగా పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ ఆదివారం సిద్దవటం కోటను సందర్శించనున్నారు. శిథిలాలబాట పట్టిన సిద్దవటం కోటను పర్యాటకులకు అందుబాటులో ఉంచడంతో పాటు కోట చుట్టూ ఉన్న కందకంలో బోటింగ్ ఏర్పాటు చేసి, దెబ్బతిన్న ప్రహరీగోడను మరమ్మతులు చేయడానికి చర్యలు తీసుకుంటారని తెలిసింది. వీటితో పాటు రాత్రి 10 గంటలు దాటితే అటవీశాఖ చెక్‌పోస్టును వాహనాలు తిరగకుండా ఫారెస్ట్ గేటును మూయడంతో పలు మండలాల వాసులు ఇబ్బందులకు గురవుతున్నారని, లంకమల్ల అభయారణ్య అడవుల్లో వెలసిన నిత్య పూజేశ్వరస్వామి కోనకు వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతినడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారని వాటిపై కూడా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. మాచుపల్లె ఖాదర్ బంగ్లా వంతెన నిర్మాణం అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు కోటి రూపాయల వ్యయంతో శంకుస్థాపన చేసి నేటికి 37 ఏళ్లు అయినా అది కలగానే మిగిలిపోయింది. వీటన్నింటిపైన పర్యాటకశాఖ మంత్రి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రెడ్డివారిపల్లె-కోడూరు మధ్య రాకపోకలు



రెడ్డివారిపల్లె-రైల్వేకోడూరు మధ్య తాత్కాలిక రోడ్డును సిద్ధం చేసిన దృశ్యం

- తాత్కాలిక రోడ్డుకు మరమ్మతులు

రైల్వేకోడూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గత 20 రోజులుగా కురిసిన భారీ వర్షాల కారణంగా రైల్వేకోడూరు-రెడ్డివారిపల్లె తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలు బంద్ అయ్యాయి. ఈ విషయంపై గత గురువారం ఆంధ్రజ్యోతిలో మూడు గ్రామాలకు రాకపోకలు బంద్ అన్న శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దీంతో శనివారం రెడ్డివారిపల్లె-రైల్వేకోడూరు మార్గంలో నిర్మించిన తాత్కాలిక రోడ్డుకు రోడ్లు భవనాల శాఖ డీఈ జయప్రసాద్ ఆదేశాల మేరకు కాంట్రాక్టర్ పాములపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో తాత్కాలిక రోడ్డు కు మరమ్మతులు చేశారు. ప్రజల రాకపోకలు ప్రారంభమయ్యాయి. గుర్రప్పాళెం-రైల్వేకోడూరు, తూర్పుపల్లె-పాట్టావాండ్లపల్లె మధ్య రాకపోకలు బంద్ అయిన విషయం తెలిసిందే. వాటికి కూడా తాత్కాలిక రోడ్లు ఏర్పాటు చేస్తామని రోడ్లు, భవనాల శాఖ అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


సంఘటనాస్థలంలో ప్రకాశ్ మృతదేహం

కురబలకోట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంగళ్లు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో యువకుడు అక్కడిక్కడే మృతి చెందాడు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి.

మదనపల్లె పట్టణం రామారావు కాలనీకి చెందిన యువకుడు ప్రకాశ్ (21) మండలంలోని అంగళ్లులో సెలూన్ దుకాణంలో పని చేస్తున్నాడు. ఇతను పనులు ముగించుకుని ద్విచక్రవాహనంలో ఇంటికి వెళుతుండగా మార్గమధ్యంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. ఈ మేరకు ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ చిన్నారిని అభినందించిన కలెక్టర్


బాలుడిని అభినందిస్తున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించిన రాజంపేట ముకుందరగడ్డకు చెందిన వీఆర్వో షేక్ ముజీబ్, షేక్ మసూదాబేగం దంపతుల కుమారుడు షేక్ మహమ్మద్‌ముష్తాక్ సిద్ధికిని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు. శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను చిన్నారి తల్లిదండ్రులు కలిశారు. చిన్నారిని మరింత ప్రోత్స హించాలని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అందుకునేలా బాగా చదివించాలని కలెక్టర్ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి


కంబాల ప్రసాద్ (ఫైల్)

రైల్వేకోడూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బెంగుళూరులో పీజీ హాస్టల్‌లో చేరడానికి వెళ్లి ఓ యువకుడు శవమై వచ్చాడు. వివరాలిలా ఉన్నాయి. రైల్వేకోడూరు పంచాయతీ పరిధిలో ఉన్న ఉన్న పగడాలపల్లెలో కంబాల సుబ్బరాయుడు, లక్ష్మీదేవిల రెండో కుమారుడు కంబాల ప్రసాద్ (22) అనే యువకుడు గత నెలలో బెంగళూరులో ఎంబీఏ చేరడానికి వెళ్లి అడ్మిషన్ తీసుకుని వచ్చేశాడు. ఈనెల 7వ తేదీ మళ్లీ బెంగళూరుకు తన మోటారు సైకిల్‌లో వెళ్లి పీజీ హస్టల్‌లో ఉండడానికి అన్ని మాట్లాడుకుని 9 తేది తెల్లవారుజామున తన స్నేహితుడు రెడ్డయ్యతో కలసి రైల్వేకోడూరుకు వస్తుండగా చిత్తూరు జిల్లా బంగారుపాళెం సమీపంలో ఉన్న డివైడర్‌ను ఢీకొట్టడంతో ప్రసాద్ తలకు తీవ్రమైన గాయమైంది.

తన స్నేహితుడు రెడ్డయ్యకు చేతికి గాయమై బయటపడ్డాడు. కుటుంబ సభ్యులు, స్నేహితులు అతడిని వేలూరు సీఎంసీకి తరలించారు.

అక్కడ 5 రోజుల పాటు చికిత్స పొందాడు. అక్కడి నుంచి రేణిగుంట సమీపంలో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ 3 రోజుల పాటు చికిత్స పొంది శనివారం ఉదయం మృతి చెందాడు. దీంతో పగడాలపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి.

నలుగురు వైద్యాధికారులకు పదోన్నతులు

కలికిరి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కడప, అన్నమయ్య జిల్లాల్లో పనిచేస్తున్న నలుగురు వైద్యాధికారులకు పదోన్నతులు కల్పించి నియమకాలు కల్పించారు. శనివారం ప్రభుత్వం ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా పదోన్నతులు పొందిన డిప్యూటీ సివిల్ సర్జన్ల నుంచి సివిల్ సర్జన్‌లుగా పదోన్నతులు పొందిన వైద్యాధికారుల జాబితాను విడుదల చేసింది. ప్రస్తుతం డిప్యూటీ సివిల్ సర్జన్ స్థాయిలో పనిచేస్తున్న ఈ నలుగురికీ సివిల్ సర్జన్ హోదా కల్పించి వివిధ పోస్టుల్లో నియమించారు. వాయల్పాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో వైద్యాధికారిగా పనిచేస్తున్న డాక్టర్ ఎస్. ఫైరోజా బేగంకు పదోన్నతి కల్పించి శ్రీసత్యసాయి పుట్టపర్తి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో)గా నియమించారు. ప్రకాశం జిల్లా మార్కాపురం డిప్యూటీ డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్న డాక్టర్ కె. పద్మావతిని కడప 300 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో సీఎస్ఆర్వోగా నియమించారు. తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలలో రీ ఓరియెంటేషన్ ఆఫ్ మెడికల ఎడ్యుకేషన్ విభాగంలో పనిచేస్తున్న డాక్టర్ జె.రామాంజనేయులును కడప క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో సీఎస్ఆర్ ఎంవో (సివిల్ సర్జన్ రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్)గా నియమించారు.అదే విధంగా కడప జిల్లా జమ్మలమడుగు డిప్యూటీ డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్న డాక్టర్ పి. శాంతికళను కర్నూలు జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో)గా నియమించారు. పదోన్నతులతో నియామకాలు పొందిన వారు 15 రోజుల్లోగా బాధ్యతల్లో చేరాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు శనివారం పదోన్నతుల జాబితాలకు సంబంధించిన ఆదేశాలు జారీ చేశారు.

సమగ్ర శిక్ష అధికారుల నియామకం

కడప, అన్నమయ్య జిల్లాల సమగ్ర శిక్షకు ఇద్దరు అధికారులను అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్లుగా నియమిస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డిప్యూటీ కలెక్టరుగా పనిచేస్తున్న ఎ.నిత్యానందరాజును కడప సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్‌గా నియమించారు.

చిత్తూరు జిల్లా పలమనేరు ఎస్వీసీఆర్ ప్రభుత్వ కళాశాలలో పొలిటికల్ సైన్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న బి.నాగరత్నంరెడ్డిని అన్నమయ్య జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా నియమించారు. ఇరువురూ ఏడాదిపాటు ఏపీడీలుగా కొనసాగుతారు.

ఈ-పరిపాలనను వందశాతం అమలు చేయాలి

కడప రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ శాఖలో ఈ-పరిపాలనను వంద శాతం అమలు చేయాలని జడ్పీ సీఈవో ఓబులమ్మ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఈ-ఆఫీస్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ-ఆఫీస్ వినియోగంపై సంబంధిత అధికారులు అవగాహనను పెంపొందించుకోవాలన్నారు. ఈ-పరిపాలన ద్వారా కార్యాలయ పరిపాలనను మరింత సులభతరం చేస్తామన్నారు. ప్రధానంగా ఎంపీడీవోలు, ఏవోలు, టైపిస్టులు ఈ-పరిపాలనపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కడప జిల్లాలోని ఎంపీడీవోలు, పరిపాలనాధికారులు (ఏవోలు), టైపిస్టులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు ఎక్కడివక్కడే..

- రూ.454 కోట్ల జీవో ఇచ్చి పరిహారాన్ని గాలికొదిలేసిన వైసీపీ సర్కారు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు
- పరిహారం కోసం గండికోట నిర్వాసితుల ఎదురుచూపు
- నేడు మంత్రి నిమ్మల గండికోట ప్రాజెక్టు సందర్శన



గండికోట ప్రాజెక్టు

కొండాపురం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గండికోట నిర్వాసితుల సమస్యలను పరిష్కరించడంలో గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని చెప్పవచ్చు. గత ప్రభుత్వం సమస్యలు గాలికొదిలేయడంతో నిర్వాసితులు పరిహారం, మౌలిక సదుపాయాల కోసం కూటమి ప్రభుత్వం పైనే ఆశలు పెంచుకున్నారు. ఆదివారం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గండికోట ప్రాజెక్టును సందర్శించనున్న నేపథ్యంలో తమ సమస్యలను పరిష్కరించాలని గండికోట నిర్వాసితులు మంత్రిని కోరుతున్నారు.

రూ.454 కోట్ల పరిహారానికి జీవో ఇచ్చి గాలికొదిలేసి..

గండికోట ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో నీళ్లు తామే మొదటిసారిగా నింపినట్లు గొప్పలు చెప్పుకున్న గత వైసీపీ ప్రభుత్వం నిర్వాసితులకు పరిహారం చెల్లించడంలో పూర్తిగా విఫలమైంది. ఎన్నికలకు తొమ్మిది నెలల ముందు 6.7.2023న గండికోట నిర్వాసితుల పరిహారం కోసం రూ.454.6 కోట్లు విడుదల చేయనున్నట్లు జీవో ఇచ్చింది. మొదటి విడత 14 ముంపు గ్రామాలకు అదనపు పరిహారం కింద ఒక్కొక్కరికి రూ. 3,25,000 చొప్పున 9096 మంది నిర్వాసితులకు గాను రూ.295.62 కోట్లు విడుదల చేయనున్నట్లు జీవోలో ఉంది. అదే విధంగా రెండో విడత 8 గ్రామాల్లో పెండింగ్ ఉన్న 573 మంది నిర్వాసితులకు రూ.58.3 కోట్లు ఇవ్వనున్నట్లు తెలిపింది. కొండాపురం పట్టణంలో సప్లిమెంటరీ జాబితా కింద 547 మంది నిర్వాసితులకు రూ.53.86 కోట్లు ఇస్తామంది. అదే విధంగా మొదటివిడత 14 ముంపు గ్రామాల్లో పూర్తి గా పరిహారం అందని నిర్వాసితులకు 46.77 కోట్లు ఇవ్వనున్నట్లు జీవోలో తెలిపింది. మొత్తం 22 గ్రామాలకు పరిహారం కింద 18,204 నిర్వాసిత కుటుంబాలకు 454.6 కోట్లు విడుదల చేయనున్నట్లు జీవోలో పేర్కొంది. ఈ జీవోకు సంబంధించి కనీసం ఒక్క రూపాయి కూడా పరిహారాన్ని నిర్వాసితులకు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం చేతులెత్తేసింది. దీంతో పరిహారం కోసం నిర్వాసితులు కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు.

వైసీపీ ప్రభుత్వం కక్షగట్టి పరిహారం ఇవ్వలేదు

గత వైసీపీ ప్రభుత్వంలో ముంపువాసుల సమస్యలను లేవనెత్తడంతో నాపై కక్షగట్టింది. నాకు రావలసిన రూ.7 లక్షల పరిహారాన్ని, భూమికి రూ.2 లక్షలు పరిహారాన్ని ఇవ్వకుండా గత ఐదేళ్లు ఆపేశారు. కూటమి ప్రభుత్వం నాతో పాటు నిర్వాసితులకు వెంటనే పరిహారం ఇవ్వాలి.

- బుగ్గన చంద్రశేఖర్‌రెడ్డి, మండల టీడీపీ ఉపాధ్యక్షుడు, తాళ్లప్రొద్దుటూరు

మౌలిక సదుపాయాలు నిల్





తాళ్లప్రొద్దుటూరు రేకులషెడ్డులో నడుపుతున్న ప్రైమరీస్కూల్, (ఇన్‌సెట్లో) పునరావాస కాలనీలో రోడ్ల దుస్థితి

గండికోట నిర్వాసితులకు మౌలిక సదుపాయాలను కల్పించడంలోనూ గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. పునరావాస కాలనీల్లో పాఠశాలలు, దేవాలయాలు, రోడ్లు, డ్రైనీజీలు, శ్మశానవాటికలు ఇలా అన్ని వసతులు అసంపూర్తిగానే ఉన్నాయి. వెంటనే మంత్రి చొరవ తీసుకొని వాటిని పరిష్కరించాలని నిర్వాసితులు కోరుతున్నారు.

గండికోట నిర్వాసితుల సమస్యల్లో ముఖ్యమైనవి కొన్ని

- నిర్వాసితులకు జీవోలో ఉన్న విధంగా రూ.454.6 కోట్లు పరిహారం ఇవ్వాలి.
- పునరావాస కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి.
- దత్తాపురం, చౌటిపల్లె ముంపునకు గురి కాక ముందు ఉన్న పంచాయతీలు యదాతథంగా ఉంచాలి.
- పునరాసం కింద పరిహారంలో కోతవిధించిన రూ.1,85,000 చెల్లించాలి.
- పరిహారం గల్లంతైన నిర్వాసితులకు తిరిగి సర్వే చేసి పరిహారం ఇవ్వాలి.
- కొండాపురం పట్టణంలో ముంపునకు గురైన ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించాలి.
- కొండాపురం జడ్పీహైస్కూల్, అసంపూర్తిగా ఉన్న తాళ్లప్రొద్దుటూరు హైస్కూల్, ప్రైమరీ స్కూలు వెంటనే పూర్తి చేయాలి.
- మంత్రి లోకేశ్ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు నిర్వాసితుల ఉపాధికి పరిశ్రమ స్థాపించాలి.
- గండికోట ప్రాజెక్టుకు పర్యాటక అభివృద్ధి చేయాలి. బోటింగ్ సౌకర్యం కల్పించాలి.
- సోమశిల ముంపువాసుల మాదిరి గండికోట నిర్వాసితులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలి.

నేడు గండికోట ప్రాజెక్టును సందర్శించనున్న మంత్రి నిమ్మల

కొండాపురం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదివారం గండికోట ప్రాజెక్టును సందర్శించనున్నట్లు జలవనరులశాఖ ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు.మచిలీపట్నం-ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలులో ఆయన ఉదయం 4.00 గంటలకు జమ్మలమడుగు చేరుకుంటారన్నారు. 4.30 గంటలకు జమ్మలమడుగు సమీపంలోని చారిత్మక గండికోట వద్ద నున్న హరితా రెస్టారెంటుకు చేరుకొని విశ్రాంతి తీసుకుంటారన్నారు. ఉదయం 8.30 గంటలకు అక్కడ నుండి బయలుదేరి రోడ్డు మార్గాన గండికోట ప్రాజెక్టుకు చేరుకుంటారన్నారు. గండికోట ప్రాజెక్టు, సొరంగం లను పరిశీలీస్తారన్నారు. అనంతరం అధికారులతో, మీడియా ప్రతినిధులతో సమావేశం అవుతారన్నారు. అక్కడి నుండి మధ్యాహ్నం 2 గంటలకు కడపకు చేరుకొని మేడాఫంక్షన్ హాలులో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారని ఈఈ తెలిపారు.అదేవిధంగా మంత్రితో పాటు ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, జమ్మలమడుగు టీడీపీ ఇన్‌ఛార్జ్ భూపేశ్‌రెడ్డిలు పాల్గొంటారని మంత్రి పర్యటన విజయవంతం చేయాలని మండల కూటమి ఇన్‌ఛార్జ్ దేవగుడి శివనారాయణరెడ్డి తెలిపారు.

ఊహించినట్లే జరిగింది..!

- హెచ్చెల్సీ ప్రాజెక్ట్ చైర్మన్‌గా జిల్లాకు చెందిన జోగిరెడ్డి ఏకగ్రీవం
- వైస్ చైర్మన్‌గా అనంతపురం జిల్లాకు చెందిన కేశవరెడ్డి



హెచ్చెల్సీ ప్రాజెక్ట్ చైర్మన్ జోగిరెడ్డి, వైస్ చైర్మన్ కేశవరెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్/ సింహాద్రిపురం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఊహించినట్లుగానే తుంగభద్ర ప్రాజెక్ట్ ఎగువ కాలువ (టీబీపీ హెచ్చెల్సీ) కమిటీ ఎన్నికైంది. కడప జిల్లాకు చైర్మన్, అనంతపురం జిల్లాకు వైస్‌చైర్మన్ పదవులు దక్కాయి. రెండేళ్ల పాటు ఒకరు, మరో మూడేళ్ల పాటు మరొకరు పదవుల్లో కొనసాగేలా పరస్పర అంగీకారంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని హెచ్చెల్సీ లోక్ డివిజన్ కార్యాలయంలో శనివారం హెచ్చెల్సీ ప్రాజెక్ట్ కమిటీ ఎన్నిక నిర్వహించారు. హెచ్చెల్సీ ఎస్‌ఈ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. అనంతపురం జిల్లాలోని 5డిస్ట్రిబ్యూటరీ కమిటీల చైర్మన్‌లు హెచ్‌ఎల్ఎంసీ కొండాపురం కేశవరెడ్డి, మిడ్‌పెన్నార్ సౌత్‌కెనాల్ డీసీ (డిస్ట్రిబ్యూటరీ కమిటీ) కొర్రపాటి శేఖర్, మిడ్‌పెన్నార్ నార్త్ కెనాల్ డీసీ రాజారెడ్డి, తాడిపత్రి బ్రాంచ్ కెనాల్ డీసీ కుమెత ప్రమీలమ్మ, గుంతకల్లు బ్రాంచ్‌కెనాల్ డీసీ బొమ్మయ్యగారి మారయ్య హాజరయ్యారు. కర్నూలు జిల్లా ఆలూరు బ్రాంచ్ కెనాల్ డీసీ నగరడోన కిష్టప్ప హాజరయ్యారు. కడప జిల్లా నుంచి కసనూరు డీసీ మారెడ్డి జోగిరెడ్డి, సింహాద్రిపురం డీసీ ఎర్రంరెడ్డి సూర్యశేఖర్‌రెడ్డి, వేంపల్లి డీసీ అన్నారెడ్డి వెంకటలక్ష్మిరెడ్డి, పెద్దముడియం డీసీ మాదవరెడ్డి, రాజుపాలెం డీసీ భూటూరు వెంకటజయరామిరెడ్డి, పొట్లదుర్తి డీసీ ఎద్దుల వెంకట సుధాకర్‌రెడ్డి హాజరయ్యారు. చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు ఒక్కొక్క నామినేషన్ రావడంతో కడప జిల్లా కసనూరు డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డిని(ఓసీ) చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా అనంతపురం జిల్లా హెచ్ఎల్ఎంసీ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ కొండాపురం కేశవరెడ్డి (బీసీ)ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీలో చైర్మన్, వైస్ చైర్మన్‌లతో పాటు మిగిలిన 10 డిస్ట్రిబ్యూటరీల చైర్మన్లు సభ్యులుగా కొనసాగుతారు. ఎన్నికైన కమిటీని పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి, అనంతపురం జిల్లా టీడీపీ అధ్యక్షుడు వెంకట శివుడుయాదవ్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, శింగనమల ద్విసభ్యకమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి తదితరులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్‌ను నూతన కమిటీ సభ్యులు పుష్పగుచ్ఛం, శాలువాతో సన్మానించారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య



ఉరివేసుకోని ఆత్మహత్య చేసుకున్న నరేష్‌కుమార్

ప్రొద్దుటూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై అప్పులపాలై నరేష్ కుమార్ (42) అనే వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం అమృతనగర్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నరేష్‌కుమార్ అమృతనగర్‌లో నివాసం వుంటూ ఆటోనడుపుతూ జీవనం కొనసాగించేవాడు. నరేష్ మద్యానికి బానిసై అప్పులు చేశాడు. అప్పు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడిని తట్టుకోలేక ఇంట్లో రేకుల పైపులకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు. నరేష్‌కు భార్య, ఒక కుమారుడు వున్నారు. భార్య గౌరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వృద్ధురాలి మృతి



వృద్ధురాలు చెంచమ్మ (ఫైల్‌ఫోటో)

బద్వేలుటౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తెలుగుగంగ రోడ్డుకు చెందిన చెంచమ్మ(88) అనే వృద్ధురాలు గత నాలుగురోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయి కనపడకుండా ఉండటంతో ఆమె ఆచూకీ కోసం కొడుకులు, బంధువులు వెతుకుతుండగా శనివారం నాగలచెరువులో మృతదేహమై తేలింది. చేపలు పట్టేందుకు వెళ్లిన కొంతమంది యువకులు.. మృతదేహాన్ని పందులు లాగుతుండటం చూసి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని బంధువులకు సమాచారం అందించడంతో వారు అక్కడకు చేరుకొని బోరున విలపించారు. పోలీసులు చెంచమ్మగా గుర్తించి మృతదేహాన్ని వారి బంధువులకు అప్పగించారు.

బాధితులకు ఆర్థిక సాయం

కడప కలెక్టరేట్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం నగరంలోని రవీంద్రనగర్‌లో గ్యాస్ సిలిం డర్ పేలి ప్రమాదం సంభవించింది. విషయం తెలుసు కున్న కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు అఫ్జల్‌ఖాన్ శని వారం ఆ కుటుంబ సభ్యులను కలిసి ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకులు డివిజన్ ఇన్‌చార్జి దినకర్ రెడ్డితో కలిసి అందజేశారు. కార్యక్రమంలో పీసీసీ నేత అలీఖాన్, కాంగ్రెస్ నేతలు, అమీద్, జహార్, రంతుల్లా ఖాన్, శ్యామలమ్మ, సంధ్య, నాగరత్నమ్మ పాల్గొన్నారు.

నేడు సన్నపురెడ్డికి కేతు పురస్కారం ప్రదానం

కడప కల్చరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): యర్రముక్కపల్లిలోని సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి స్మారక జీవన సాఫల్య పురస్కారాన్ని కథ, నవలా రచయిత సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డికి ప్రదానం చేయనున్నట్టు కవిత విద్య సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షులు అలపర్తి పిచ్చయ్య చౌదరి తెలిపారు. తమ సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ కార్యక్రమానికి పలువురు సాహితీ ప్రముఖులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. జిల్లాలోని కవులు, రచయితలు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ చదువుతున్న విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన డబ్బులు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పూలరాజు డిమాండ్ చేశారు. శనివారం కడప కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో నారాలోకేశ్ ఇచ్చిన హామీ జీఓ 77 రద్దు చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.2100 కోట్లు, వసతిదీవెన రూ.1480కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పైబడినా ఇంతవరకు జీఓ నెంబర్ 77పై మాట్లాడడం లేదన్నారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కె.శివశంకర్, జిల్లా సహాయ కార్యదర్శి చంద్ర, అరుణ్, నగర అధ్యక్ష కార్యదర్శులు అఖిరానందన్, తేజ, నగర నాయకులు అశోక్, శమంత్, నిఖిల్, రాజేష్, మస్తాన్, సల్మాన్, ఈశ్వర్‌రెడ్డి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులకు పార్టీ అండగా ఉంటుంది

మదనపల్లె టౌన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులకు పార్టీ అధిష్ఠానం ఎల్లవేళలా అందుబాటులో వుంటుందని మదనపల్లె మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో మాలేపాడుకు చెందిన టీడీపీ నాయకులు రమేశ్, గణేష్‌లను దొమ్మలపాటి పరామర్శించారు. ఈ సందర్భంగా నల్లరాజు గారిపల్లెలో శుక్రవారం రాత్రి జగన్ ఫ్లెక్సీ బ్యానర్ల ఏర్పాటు విషయమై టీడీపీ నాయకులపై వైసీపీ నాయకులు హత్యాయత్నానికి ఒడిగట్టడాన్ని రమేశ్ ఖండించారు. ఈ విషయమై పార్టీ అధిష్ఠానం సీరియస్‌గా తీసుకుందని, దాడి చేసిన వైసీపీ నాయకులపై కఠినంగా చర్యలు తీసుకోవాల్సిందిగా పోలీసులను కోరామన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి దాడులు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు దేవరింటి శ్రీనివాసులు, క్లస్టర్ ఇన్‌చార్జి మేకల రెడ్డిశేఖర్, ఎస్ఎల్‌వీ రఘు, సాయిచిత్ర భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వాస్పత్రిలో టీడీపీ నాయకులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి, టీడీపీ నాయకులు

ఉజ్వల భవిష్యత్తుకు వైవీయూ జ్ఞాన కేంద్రం

- వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి



సభావేదికపై హాజరైన ముఖ్యఅతిథులు

కడపఎడ్యుకేషన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కన్నవారి ఆకాంక్షలను నెరవేర్చి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకునేందుకు విద్యార్థులకు యోగివేమన విశ్వవిద్యాలయం చక్కటి జ్ఞాన కేంద్రం అని యోగివేమన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. శనివారం యోగివేమన విశ్వవిద్యాలయంలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఇండక్షన్ (ప్రేరణ) కార్యక్రమం ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. ఉపకులపతి మాట్లాడుతూ విద్య కోసం ప్రభుత్వం ఎంతో ఖర్చు చేస్తోందని మీరు ప్రయోజకులై సమాజ అభివృద్ధికి ఖర్చు చేయాలన్నారు. ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన ఫ్యాకల్టీ, విలువైన పుస్తకనిధి కలిగిన లైబ్రరీ ఉందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రిజిస్టర్ ఆచార్య పి.పద్మ మాట్లాడుతూ దేశంలోని అత్యున్నత విశ్వవిద్యాలయంలో వైవీయూ ఒకటన్నారు. వైవీయూ విద్యార్థుల సమగ్రాభివృద్ధికి అద్భుతమైన వేదికన్నారు. ప్రధానాచార్యులు ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు కళాశాలలో లభించే వనరులు, సద్వినియోగం చేసుకొనే విధానం వివరించారు. గౌరవ అతిథులుగా రాజంపేట స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్ మాట్లాడుతూ గురువు మందలిస్తున్నాడంటే మిమ్మల్ని ఉన్నతంగా మలుస్తున్నారని భావించాలన్నారు. అనంతరం చిన్మయ మిషన్ అధ్యక్షుడు తురియానంద స్వామి, తైక్వాండో శిక్షణ నిపుణుడు ఎం.నాగూర్‌బాబు, వ్యాయామ క్రీడల శాస్త్ర సంచాలకుడు డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి ప్రసంగించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

సాంస్కృతిక విభాగ సంచాలకులు ఆచార్య విజయభారతి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శన సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

ముగ్గురు దొంగలు అరెస్టు

- రూ.7 లక్షల విలువచేసే బంగారు ఆభరణాలు, కారు స్వాధీనం



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు, పోలీసు సిబ్బంది, పట్టుబడిన బంగారు ఆభరణాలు, నగదు

జమ్మలమడుగు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బంగారు నగలు చోరీ చేసిన కేసులో ముగ్గురు దొంగలను అరెస్టు చేసి, ఆభరణాలతో పాటు కారు స్వాధీనం చేసుకున్నట్లు జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం సాయంత్రం అర్బన్ పోలీసుస్టేషన్‌లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 11న జమ్మలమడుగు పట్టణంలోని నేతాజీనగర్‌లో బి.చెన్నారెడ్డి ఇంటిలో మధ్యాహ్న సమయంలో ఇంటికి వేసిన తాళాలు పగులకొట్టి బీరువా పగులకొట్టి రూ.35 వేలు నగదు ఎత్తుకెళ్లినట్లు ఆయన తెలిపారు. అదే రోజు బాధితుల ఫిర్యాదు మేరకు కడప నుంచి వచ్చిన నిపుణులు ఫింగర్‌ప్రింట్ తీసుకోగా అందులో మెరుగుబాబు ఫింగర్‌ప్రింట్స్ దొరికాయన్నారు. గువ్వలచెరువు క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా రాబడిన సమాచారం మేరకు ఒక నంబరులేని కారులో వారు ప్రయాణిస్తూ దొరికారు. పై ముగ్గురిని అర్బన్ పోలీసుస్టేషన్‌కు తెచ్చి విచారణ చేయగా వారు మరికొన్ని కేసుల్లో ఉన్నట్లు తెలిసిందన్నారు. మెరుగు బాబు, రాబూరి అన్వేషి, పిల్లనారప్పగారి కళావతి జమ్మలమడుగు మండలంలోని రాజీవ్‌నగర్ కాలనీ గూడెం చెరువువాసులు. కాగా వారి వద్ద నుంచి 15 తులాల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నామన్నారు. రూ.20 వేలు నగదు, మొత్తం రూ.7 లక్షలు విలువచేసే ఒక కారు స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన నిందితులను కోర్టుకు హాజరుపరచనున్నట్లు డీఎస్పీ తెలిపారు. కేసును ఛేదించిన ఎస్ఐ రామక్రిష్ణ, పోలీసులు దేవదాసు, రియాజ్, రామాంజనేయరెడ్డిలకు ఎస్పీ, డీఎస్పీ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీఐలు లింగప్ప, గోపాల్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ఆకస్మిక తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ

కడపక్రైం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కడప నగరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌ను శనివారం కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్‌లోని పలు రికార్డులు పరిశీలించారు. పెండింగు కేసుల వివరాలపై ఆరా తీశారు. నగరంలో పోలీసు 30 యాక్టు అమలులో ఉందని, అనుమతులు లేకుండా సభలు నిర్వహించరాదన్నారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. రానున్న డిసెంబరు 31న రాత్రి ఎక్కడా అల్లర్లు జరగకుండా చూడాలన్నారు. రాత్రి పూట మద్యం తాగి వాహనాలు ఇష్టానుసారంగా నడిపితే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ రామక్రిష్ణ, ఎస్ఐ అమర్‌నాథరెడ్డిలు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

కడప కల్చరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగర రవీంద్రనగర్‌కు చెందిన వెన్నపూస భాస్కర్‌రెడ్డి అనే అనాథ శవానికి శనివారం కాశీవిశ్వనాథ సేవా సమితి ప్రతినిధులు మానవత్వంతో హిందూ సాంప్రదాయ ప్రకారం అంత్య క్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందినట్లు వెల్లడించారు. కాగా మృతి చెందిన విషయాన్ని వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినప్పటికీ స్పందించకపోవడంతో తమ సమితి ఆధ్వర్యంలో అంత్యక్రియలు పూర్తి చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సేవా సంస్థ ప్రతినిధులు ఆర్టీసీ కానిస్టేబుల్ గుండ్లకొండ రవి, రెడ్డిలక్ష్మణ్, పురుషోత్తం, దామోదర్, విజయ్, రాఘవేంద్ర, తదితరులున్నారు.

అకాల వర్షం.. అరటి ధర పతనం

● కొనేనాథులు లేక పొలాల్లోనే మగ్గుతున్న కాయలు ● ఆందోళనలో రైతులు



తోటలోనే వదిలివేసిన అరటిగెలలు

చిట్వేలి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అనుకూలించని వాతావరణం, గిటుబాటుకాని ధరల కారణంగా అరటి రైతు ఏటేటా అష్టకష్టాలు ఎదుర్కొంటున్నాడు. ఈ ఏడు సైతం మండలంలోని అరటి రైతులు గిట్టుబాటు ధరలు లేని కారణంగా అరటి గెలలను కోయకుండా వదిలేశారు. చిట్వేలి మండలంలో 550 ఎకరాల్లో అరటి సాగవుతోంది. ఒక్కో రైతు ఎకరాకు రూ.1.50 లక్షల వరకు పెట్టుబడులు పెట్టారు. దిగుబడులతో పాటు ధరలు కూడా బాగా ఉండడంతో తమ కష్టానికి తగిన ప్రతిఫలం లభిస్తుందని ఆనందించారు. అంతలోనే కురిసిన వర్షాలు వారి ఆశలపై నీళ్ల కుమ్మరించాయి. దీంతో రెండు మూడు నెలల కిందట కిలో అరటికాయలు రూ. 25 నుంచి 30 దాకా, ఒక గెల 250 నుంచి 300 వరకు ధర పలికిన కాయలు ప్రస్తుతం కిలో ఐదు రూపాయలకు పడిపోయాయి. దీంతో రైతులు గెలలను చెట్లకే వదిలేస్తున్నారు. కౌలురైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది.. బయటి రాష్ట్రాలకు ఎగుమతులు కూడా నిలిచిపోవడంతో పాటు, కొనుగోలు చేసే నాథులే లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కళ్లెదుటే పంట మగ్గి పోతున్నా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో పడ్డారు.

ధర లేక తోటలోనే వదిలేశా



ఎకరా స్థలంలో అరటి సాగు చేశాను. రెండు మూడు నెలల క్రితం వరకు బాగానే ఉన్న ధర వర్షాల కారణంగా అమాంతం పడిపోయాయి. కిలో 5 రూపాయలకు కూడా అడిగేనాథులే లేరు. ప్రకృతి అనుకూలించకపోవడంతో ప్రతి ఏటా రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ప్రభుత్వం వినూత్నంగా ఆలోచించి రైతులను ఆదుకోవాలి.

-మహంకాళి నాగేంద్ర, రైతు

లారీల ఢీ ఒకరికి గాయాలు

ఓబులవారిపల్లె, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రెండు లారీలు ఎదురెదురుగా ఢీ కొనడంతో ఓ వ్యక్తికి గాయాలు కాగా, ఇరు వాహనాలు దెబ్బతిన్నాయి. కడప - చెన్నై జాతీయ రహదారిలోని రెడ్డిపల్లె చెరువు కట్ట వద్ద కడప వైపు నుంచి ఓబులవారిపల్లెకు వస్తున్న గ్యాస్ వాహనం, తిరుపతి వైపు నుంచి కడపకు వెళుతున్న లారీని ఢీ కొంది. ఈ ప్రమాదంలో గ్యాస్ తరలించే వాహన డ్రైవరు ఊత్తుకోట్టైకి చెందిన మణి మూర్తికి గాయాలు కాగా, రెండు వాహనాలు దెబ్బ తిన్నాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం రాజంపేటకు తరలించారు. కాగా సుమారు అర గంటపాటు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వాహనాలు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

మంగంపేటలో రేపు హెల్త్ క్యాంపు

ఓబులవారిపల్లె, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మంగంపేటలోని ఏపీఎండీసీ వైద్య కేంద్రంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు భవ్య హెల్త్ సర్వీస్ సిబ్బంది తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ శిబిరంలో కన్ను, మధుమేహం, మూత్రపిండాల సమస్యలతోపాటు అన్నిరకాల సాధారణ వ్యాధులకు పరీక్షలు చేస్తారని, ఈ అవకాశాన్ని ఉద్యోగులు పరిసరాల గ్రామ ప్రజలు వినియోగించుకోవాలని ఏపీఎండీసీ హెల్త్‌సెంటర్ నిర్వాహకులు తెలిపారు.

వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం

రాయచోటిటౌన్, డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజును శనివారం అన్నమయ్య జిల్లా వాల్మీకి సంఘం అధ్యక్షుడు మండ్ల భక్తవత్సలం ఆధ్వర్యంలో వాల్మీకి సంఘం నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు వైఎస్ఆర్ కడప జిల్లా ప్రొద్దుటూరులోని ఆయన స్వగృహంలో కలిసి శాలువా, పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వాల్మీకి కార్పొరేషన్ ద్వారా అన్నమయ్య జిల్లాలోని వాల్మీకుల (బోయల) సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాయచోటి వాల్మీకి సంఘం నేతలు మండ్ల సుదర్శన్, మండ్ల రెడ్డిరూపేశ్, బండపల్లి శశిధర్, చింతల పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం చేరిన మహా సంకల్ప పాదయాత్ర

సిద్దవటం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గురుస్వామి రత్నాచారి ఆధ్వర్యంలో రాజంపేటలో శుక్రవారం ఉదయం ప్రారంభమైన బ్రహ్మంగారి మఠానికి మహాసంకల్ప పాదయాత్ర శనివారం సిద్దవటానికి చేరుకుంది. ఈ సందర్భంగా గురుస్వామి రత్నాచారి మాట్లాడుతూ దాదాపు 60 మంది ఈ పాదయాత్రలో పాల్గొంటున్నారని దారి పొడవునా భక్తులు సహకరిస్తున్నారని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని ప్రకృతి వ్యవసాయ ఎన్‌ఫ్‌ఏ పవన్‌కుమార్ తెలిపారు. శనివారం మద్దిరేవుల ఈడిగ ఎల్లెలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,గతంలో ప్రతి రైతు సొంతంగా తయారు చేసుకున్న ఎరువులతోనే పంటలు సాగు చేసేవారని రానురాను రసాయనిక ఎరువుల వాడకం పెరిగిపోయిందన్నారు. రసాయనిక ఎరువులను పూర్తిగా తగ్గించి ప్రకృతి ఎరువులతో పంటలు సాగుచేసుకోవాలన్నారు. పంట సాగుచేసిన తరువాత చీడపీడలు నివారణకు కషాయాలు తయారు చేసుకొని పొలంలో స్ప్రే చేసుకోవచ్చునన్నారు. ప్రతి వ్యక్తి కిచెన్ గార్డెలో ప్రకృతి ఎరువులతో కూరగాయలు సాగుచేసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో మద్దిరేవుల సర్పంచు చంద్రమ్మ, మాస్టర్ ట్రైనర్స్ వెంకటరమణ, చిన్నరెడ్డెన్న, మధుకర్, వెంకటజ్యోతి, సరస్వతి, ఎల్ 2 నాగార్జున, చంద్రమోహన్‌రెడ్డి, నాగమణి, లక్ష్మీదేవి, షాహిర్‌బాషా, గంగిరెడ్డి, అంజనమ్మ రైతులు పాల్గొన్నారు

శ్రీనివాస రామానుజన్‌కు ఘన నివాళి



రైల్వే కోడూరు: రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

రైల్వేకోడూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి. రమేష్ అధ్యాపకులు, సిబ్బంది శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గణిత శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ జి. శివయ్య, కళాశాల ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ జి. దయానందం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేట: మండల పరిధిలోని టి.కమ్మపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయులు షమీర్ హుస్సేన్, గిరిధర్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో చక్రధర్ రాజు శ్రీనివాసరామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు తయారు చేసిన గణిత ప్రదర్శనలు పరిశీలించి అభినందించారు. పాఠశాల చైర్మన్ పి.నాగేశ్వర్, హెడ్మాస్టర్ బబిత, కోఆప్షన్ మెంబర్ చంద్రశేఖర్‌నాయుడు, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట: రాజంపేట పట్టణంలోని రాజు విద్యాలయంలో జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా గణితశాస్త్ర పితామహుడు సీ రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పాఠశాల సీఈవో జి.రఘురామరాజు, హెడ్మాస్టర్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గణితంపై విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు బాల గంగాధర్‌నాయుడు, అంకయ్య, జయప్రకాష్, వెంకటేశ్, లక్ష్మీ, సునీల్‌కుమార్‌రెడ్డి, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్లు తొలగించండి



సింగారెడ్డిపల్లె జగనన్నకాలనీ లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారులు

పెనగలూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్లను తొలగిస్తే ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుంటామని సింగారెడ్డిపల్లె హరిజనవాడ జగనన్న కాలనీ లబ్ధిదారులు అధికారులకు తెలిపారు. శనివారం ఎంపీడీవో విజయరావు, హౌసింగ్ కార్పొరేషన్ ఏఈ హరిప్రసాద్ కాలనీలోని లబ్ధి దారులతో మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుంటే త్వరగా బిల్లులు మంజూరవుతాయని తెలిపారు. అనంతరం లబ్ధిదారులు మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలపె తక్కువ ఎత్తులో విద్యుత్ లైన్లు ఉన్నాయని, వాటిని తొలగిస్తే నిర్మాణాలు పూర్తి చేసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంటనే విద్యుత్తుశాఖ ఏఈ షఫీతో మాట్లాడగా సాధ్యమైనంత త్వరలో లైన్లు పక్కకు మారుస్తామనిహామీ ఇచ్చారు.

మంత్రి పర్యటనకు ఏర్పాట్లు సిద్ధం



సిద్దవటం కోటలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జనసేననాయకుడు కృష్ణ

సిద్దవటం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దవటం కోటను ఆదివారం రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ సందర్శించనుండడంతో ఉమ్మడి కడపజిల్లా జనసేన పార్టీ నాయకుడు అతికారి కృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటక రంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతిపక్ష హోదాలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఇచ్చిన వాగానం నెరవేతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రతినిధి బి.ఓబులయ్య, మండల కూటమి నేతలు పాల్గొన్నారు.

చేనేత క్లస్టర్ పనుల తనిఖీ



పనులు తనిఖీ చేస్తున్న పీడీ

సిద్దవటం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం -1 గ్రామం ఎస్‌కేఆర్ నగర్‌లోని చేనేత క్లస్టర్‌లో పనులను హౌసింగ్ పీడీ రాజారత్నం శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత క్లస్టర్‌లో జరుగుతున్న పనుల్లో నాణ్యత లోపిస్తే బిల్లులు నిలిపివేస్తామని హెచ్చరించారు. నిర్దేశిత సమయంలోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జేఈ ప్రేమ్‌దాస్, కాంట్రాక్టర్ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి : సీపీఎం

రాజంపేట టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను కించపరిచిన అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు చిట్వేలి రవికుమార్, పందికాళ్ల మణి డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ కేవలం దళితనాయకుడు కాదని, దేశం ఉన్నతికోసం పాటుపడిన మేధావి అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు మల్లికార్జున, సుధీర్, నరసయ్య, మణి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు న్యాయవాదులకు మీడియేటర్ సర్టిఫికెట్లు



సర్టిఫికెట్లను అందుకుంటున్న న్యాయవాదులు

నందలూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నందలూరు బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ షేక్ మహ్మద్ అలీ, సెక్రటరీ సుబ్బరామయ్య ఏపీ స్టేట్ లీగల్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ ఏపీ హైకోర్టు జడ్జి నరేందర్ చేతుల మీదుగా మీడియేటర్ సర్టిఫికెట్లను అందుకున్నారు. ఏపీ స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో కడపజిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ నిర్వహించిన మీడియేటర్ (మధ్యవర్తిత్వం) 5 రోజులు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా షేక్ మహ్మద్‌అలీ మాట్లాడుతూ తమకు ట్రైనర్లుగా కర్ణాటకకు చెందిన బీనా దేవరాజ్, తమిళనాడుకు చెందిన డాక్టర్ పద్మ వ్యవహరించారని తెలిపారు. జిల్లా జడ్జిలు ప్రవీణ్‌కుమార్, వెంకటేశ్వర్లు శిక్షణ పొందినవారికి సర్టిఫికెట్లు అందజేశారన్నారు. జ్యుడిషియల్ వ్యవస్థలో మీడియేటర్ల పాత్ర కీలకమని, మధ్యవర్తిత్వంతో సమస్యలు సత్వరం పరిష్కారమయ్యేందుకు అవకాశం కలుగుతుందన్నారు.

చేనేతలకు ట్రాన్స్‌కో అధికారుల మొండి చేయి



రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

వీరబల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అర్హులైన చేనేత కార్మికులందరికీ విద్యుత్ బిల్లుల్లో రాయితీ కల్పించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అధికారుల చర్యలతో నీరుగారుతున్నాయని రాష్ట్ర చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు వెంకటేశ్ ఆరోపించారు. విద్యుత్ రాయితీ లబ్ధిదారులను గుర్తించడంలో ట్రాన్స్‌కో అధికారులు నామమాత్రంగా వ్యవహరిస్తూ అర్హులకు మొండిచేయి చూపుతున్నారని ఆరోపిస్తున్నారు. .అన్ని అర్హతలు ఉన్నా గుర్తింపు కార్డు లేదనే ఉద్దేశ్యంతో పలువురు కార్మికుల పేర్లు నమోదు చేయడంలేదన్నారు. సొంత మగ్గం ఉన్న ప్రతి కార్మికుడికి విద్యుత్ రాయితీ అందేలా చూడాలని ఆయన కోరారు.

చేతిపంపునకు మరమ్మతులు



చేతిపంపునకు మరమ్మతులు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

రాయచోటిటౌన్, డిసెంబరు21 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని రాయుడు కాలనీలో చెడిపోయి నిరుపయోగంగా మారిన చేతి పంపునకు శనివారం మునిసిపల్ నిధులతో మరమ్మతులు చేసినట్లు రాయుడుకాలనీ టీడీపీ నాయకుడు రంజిత్ రాయల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ బోరు చెడిపోవడంతో దానిని వినియోగించుకోలేకపోతున్నామలని, స్థానికులు తమ దృష్టికి తెచ్చారన్నారు. సమస్యను మడితాటి శ్రీనివాసులరెడ్డి ద్వారా మంత్రి దృష్టికి తీసుకువెళ్లడంతో, మున్సిపల్ అధికారులు ఆ సమస్యను పరిష్కరించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాయుడుకాలనీలో నెలకొన్న ప్రతి సమస్య పరిష్కారానికి నోచుకుంటోందన్నారు. దీంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

డీబీఎన్ పల్లెలో రోడ్డు పనులకు భూమిపూజ



రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న జగన్‌మోహన్‌రాజు

రాజంపేట,డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కూచివారిపల్లె పంచాయతీ డీబీఎస్‌పల్లెలో సిమెంటు రోడ్లు పనులకు రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకులు అభివృద్ధి నిరోధకులుగా మారారని, అభివృద్ధి పనులను అడుగడుగునా అడ్డుకుంటున్నారన్నారు. రాజంపేట నియోజకవర్గ అభివృద్ధిని అడ్డుకుంటే ఉగ్గుపాలు కక్కిస్తామని వైసీపీ నాయకులను హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రతాప్‌రాజు, సర్పంచ్ మంగమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు ఖాదర్‌బీ, కాకతీయసేవా సమితి జిల్లా అధ్యక్షుడు శివనారాయణచౌదరి, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కొండూరు శరత్‌కుమార్‌రాజు, మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు బాపనయ్య నాయుడు, టీఎన్ ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, మల్లికార్జున నాయుడు, చెరవు సంఘం అధ్యక్షుడు నాగేశ్వరనాయుడు, ఉపసర్పంచ్ మల్లికార్జుననాయుడు పాల్గొన్నారు.

గోవింద మాలధారులకు అన్నదానం

సుండుపల్లె, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని విరూపాక్ష చెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం గోవింద మాలధారులకు యల్లమ్మ, రమణయ్య కుటుంబీకులు అన్నదానం చేశారు . అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

'హైందవ శంఖారావం' జయప్రదం చేయండి

రామాపురం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): హైందవ శంఖారావం పేరుతో జనవరి 5న విజయవాడలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని అన్నమయ్య జిల్లా భజరంగదళ్ సహ సంయోజక్ కొవ్వూరి వీరారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో నిర్వహించిన విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుమల, తిరుపతి దేవస్థానంలో ప్రసాదం అపవిత్రం విషయంలో వెలువడిన సమాచారం ప్రపంచ వ్యాప్తంగా హిందువులను దిగ్భ్రాంతికి, ఆందోళనకు గురి చేసిందన్నారు. దేవాదాయ ధర్మాదాయశాఖ నిర్వహిస్తున్న ఆలయాల్లో హిందువులు సమర్పించిన ముడుపులు, కానుకలు దుర్వినియోగం అవుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె మండల విశ్వహిందూ పరిషత్ ప్రఖండ అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి దామోదర్‌నాయుడు, అర్చక పురోహిత్ ప్రముఖ్ నాగరాజు, రామాపురం మండల ప్రఖండ ఉపాధ్యక్షులు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

'పట్టాలిచ్చారు.. స్థలం చూపండి'

సుండుపల్లె, డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): పట్టాలిచ్చారు గానీ, స్థలం చూపించలేదంటూ సుమారు 60 మంది శనివారం ఈడిగపల్లిలో ప్రత్యేక అధికారి జయరాములు ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. .ఈ అర్జీని ఆన్‌లైన్ చేసి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. జగనన్న కాలనీ లబ్ధిదారులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రామాజగదీశ్, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌రాజు, డిప్యూటీ తహసీల్దార్ రెడ్డెన్న, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేంద్రనాయక్, వీఆర్‌వో బసయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

ఓబులవారిపల్లె, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో ఏళ్లుగా దరఖాస్తు చేసుకుంటున్నా రెవెన్యూ అధికారులు సమస్యలు పరిష్కరించడం లేదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పందుగోల మణి రెవెన్యూ సదస్సులో అధికారులకు విన్నవించారు. మండలంలోని వైకోటలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ వైకోట గ్రామంలో సుమారు 200 కుటుంబాలుండగా, పొలాలకు వెళ్లేందుకు దారులు లేకపోవడం రైతుల మధ్య గొడవలకు దారి తీస్తోందన్నిరు. సుమారు వెయ్యి ఎకరాల భూములకు సక్రమంగా దారులు లేవని, అలాగే అటవీశాఖకు, రైతులకు సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ నాయకులు జయరామయ్య, మండల అధ్యక్ష, కార్యదర్శులు మల్లిక, వెంకటరమణ, కొమ్మిది వెంకటరమణ, పీహెచ్‌ఎస్ నియోజకవర్గ నాయకులు కటారి గోపాల్, రైతు సంఘం నాయకులు చెన్నూరు హరి, గ్రామస్థులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులతో కాలువలకు మహర్దశ



ఉపాధి పనులను తనిఖీ చేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్ రవీంద్ర

సుండుపల్లె, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద సాగు నీటి కాలువల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు టెక్నికల్ అసిస్టెంట్ రవీంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్ అమరావతి తెలిపారు. శనివారం మండలం లోని మాచిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీ మిట్టబిడికి సమీపంలో, పెద్దబిడికి, రెడ్డిచెరువు భాగంలోని పిల్లకాలువ ప్రాంతాల్లో ఉపాధి పనులను తనిఖీ చేశారు. పింఛ కుడికాలువ ద్వారా వచ్చే నీటిని పిల్ల కాలువల ద్వారా పొలాలకు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతులు సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని తెలిపారు. శనివారం సుమారు 100 మంది ఉపాధి కూలీలు పనులకు హాజరైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా రికార్డులు తనిఖీ చేసినట్లు టెక్నికల్ అసిస్టెంట్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణ పనుల తనిఖీ

పెనగలూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండ లంలోని పొందలూరు గ్రా మంలో గ్రామ ప్రజలు, దేవాదాయశాఖ నిధులతో పునర్నిర్మిస్తున్న ఆలయ ప నులను శనివారం జిల్లా దేవాదాయశాఖ అధికారి సి.విశ్వనాథ్ తనిఖీ చేశారు. 68 లక్షలు సీజీఎఫ్ నిధులు, 22 లక్షలు గ్రామ ప్రజల విరాళాలతో కలిపి ఈ దేవాలయ నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు వడ్డి తిరుపాల్‌రెడ్డి, మధు, దినేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'ధ్యానంతో ఒత్తిడి నుంచి విముక్తి'

వీరబల్లి, డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): ఒత్తిడి నుంచి విముక్తికి ధ్యానం సరైన మార్గమని వీఆర్‌డీఎస్ సురేంద్రారెడ్డి తెలిపారు. ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక ఎస్టీకేఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ధ్యానంపై అవగాహనకల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రవిశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు రమణ, శ్రీను, లక్ష్మణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయచోటిటౌన్: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం ప్రపంచ ధ్యాన దినోత్సవాలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా శ్రీరామచంద్ర మిషన్‌కు చెందిన గ్రంధే సత్య కుమారి, గ్రంధే మనోజ్‌కుమార్ ధ్యానంతో మానసిక, శారీరక ప్రయోజనా లను వివరించారు. అనంతరం అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులకు ధ్యానం చేసే విధానాన్ని నేర్పించారు.

రాజంపేట టౌన్ : స్థానిక సరస్వతి పిరమిడ్ యోగా ఆధ్వర్యంలో 100 మంది విద్యార్థులు ధ్యానమందిరంలో ధ్యానం నిర్వహించారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమణరాజు, పిరమిడ్ సొసైటీ అధ్యక్షుడు అంజనేయులు నాయుడు, మాట్లాడుతూ ధ్యానం ఆరోగ్యానికి దివ్యౌధం లాంటిదన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

రైల్వేకోడూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పుట్టిన రోజు సందర్భంగా శనివారం రైల్వేకోడూరు ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం: మండలంలోని బాకరాపేట మూడు రోడ్ల కూడలిలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి పాల్గొన్నారు. సిద్దవటం శివారులోని పరమాత్మ సేవ తపోవనం వృద్ధాశ్రమంలో వృద్ధు లకు పండ్లు పంపిణీ చేశారు. మాధవరం, ఒంటిమిట్టలో ఆయా ప్రాంతాల నాయకులు వేడుకలు నిర్వహించారు.

విచారణ చేశారు.. చర్యలు మరిచారు!

వీరబల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సానిపాయి గ్రామ పంచాయతీలో విధులు దుర్వినియోగంపై గత నెల 15న అధికారులు విచారణ చేశారు. ఇందుకు సంబంధించిన నివేదికను అధికారులు ఫిర్యాదుదారులు తెలుగు యువత జిల్లా కార్యదర్శి నేతి రమేశ్‌బాబు, నేతి రాంమోహన్, 6వ వార్డు మెంబర్ గుగ్గిళ్ల వెంకటేశ్‌కు అందజేశారు. గ్రామ పంచాయతీలో 14,87,666 లక్షల రూపాయలు అవినీతి జరిగిందని నివేదికలో పేర్కొన్నారు. అయితే, రోడ్డులేని పోకలవాండ్లపల్లెకు గ్రావెల్ రోడ్డు వేసి రూ. 1,37,441లు, అంచలవాండ్లపల్లె, ముద్దంవాండ్లపల్లె, మల్లప్పనాయునివారిపల్లెల్లో రోడ్డుకు గ్రావెల్ తోలినట్టు మెజర్మెం ట్ తయారు చేసుకొని దాదాపు 20 లక్షల దాకా బిల్లులు చేసుకున్నారని, క్షేత్ర స్థాయిలో విచారణ చేస్తే పూర్తి స్థాయి దుర్వినియోగంవెలుగులోకి వస్తుందని ఫిర్యాదుదారులు మీడియాకు తెలియజేశారు. రూ. 14,87,666లు నిబంధనలకు విరుద్ధంగా డ్రా చేశారని విచారణ అధికారి డీపీవోకు నివేది సమర్పించి 22 రోజులు గడిచినా ఇంతవరకూ ఎటువంటి చర్యలు తీసుకోక పోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆరోపించారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు

రైల్వేకోడూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక హెచ్‌ఎంఎం హైస్కూలులో శనివారం కరస్పాండెంట్ దేవసుందరం ఆధ్వర్యంలో ముందస్తుగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు పుష్పరాజ్, పద్మజ, శివశంకర్‌రాజు, మల్లయ్య, మేరీగ్లోరియా, పాస్టర్ సుందరం తదితరులు పాల్గొన్నారు.

ఆపన్నులకు అన్నసమర్పణ

● పాడుబడిన గుడులు, బడుల శుభ్రతపై ప్రత్యేక దృష్టి
● నిలువ నీడలేకున్నా.. సేవా కార్యక్రమాల్లో ముందుకు
● శ్రీసుమఖీ అన్నపూర్ణేశ్వరీ సేవా సమితి సభ్యుల సేవలు అసామాన్యం


రుచికరమైన వంటకాలను పంపిణీ చేస్తున్న దృశ్యం


గుడిని శుభ్రం చేస్తున్న కమిటీ సభ్యురాలు

కడప కలెక్టరేట్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మంచితనం మానవత్వం వారి అభి మతం. పేదలన్నా, అనాధలన్నా, హాస్టల్ విద్యార్థులన్నా అక్కున చేర్చుకుంటారు. వారికి మంచి రుచికరమైన ఇంటి భోజనం అందించి కొసరి కొసరి వడ్డిస్తారు. అంతేకాదు జిల్లాలో మారుమూల గ్రామాల్లో, కొండలు గుట్టల్లో ప్రభుత్వ, ప్రజల ఆదరణకు నోచుకోలేని పురాతన దేవాలయాలను శుభ్రం చేస్తారు. ఆధ్యాత్మిక సేవల్లో తమవంతు సాయం అందించి, ఆపన్నులకు అన్నసమర్పణా చేస్తూ మానవతను చాటుతున్న అసామన్యులు శ్రీ సుమఖీ అన్నపూర్ణేశ్వరీ సేవా సమితి సభ్యులు. వీరంతా కడప కేంద్రంగా సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. కానీ వీరంతా జిల్లాలో పలు గ్రామాలకు చెందిన మనసున్న మంచి మనుషులు.

మూడేళ్ల కిందట ఐదుగురు సభ్యులతో..

అది కరోనా సమయం. మనుషుల్లో మానవత్వం మాయం అవుతున్న రోజులవి. ప్రపంచమంతా ఈ వైరస్‌కు భయపడి ఇంటిగడప దాటి బయటకు అడుగు పెట్టలేని పరిస్థితి. ఒకపక్క కాలు కదపకుండా ప్రభుత్వం ఆంక్షలు.. మరోపక్క పనులు లేక ఎందరో పేదలు ఆకలితో అల్లాడారు. ఇలాంటి సంఘటనలు కళ్లారా చూసిన కడప శంకరాపురానికి చెందిన రామ్మూర్తి, పరమేశ్వరరెడ్డి, సుబ్రమణ్యం, దస్తగిరిరెడ్డిలను కలచి వేసింది. అనుకున్నదే తడవుగా తమ వంతుగా పేదలకు ఏదో ఒక సహాయం చేసి మానవత్వాన్ని చాటుకుందామని టీ తాగుతూ ఆ నలుగురు కూడబలుక్కుకున్నారు. తమకు తెలిసిన స్నేహితులు, బంధువుల వద్ద కరోనా విలయం, మనిషి జీవితంపై పడిన ప్రభావం గూర్చి వివరించడంతో పాటు ఏదో ఒకటి చేద్దామని సహకారం కోరగా వారు పట్టించుకోలేదు. మానవసేవే మాధవ సేవ అని బలంగా నమ్మిన వీరికి మైదుకూరుకు చెందిన లక్ష్మీదేవి నేను సైతం అంటూ తోడయ్యారు. ఇలా మూడేళ్ల కిందట ఐదుగురు సభ్యులతో సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. తమ దగ్గర ఉన్నంతలోనే పేదలకు, అనాధలకు అన్నసమర్పణ చేయడమే లక్ష్యంగా ముందుకు అడుగులు వేశారు.

వీరంతా సంపన్నులు, ఇన్‌కంటాక్స్ పేయర్స్ కానేకాదు. చిన్నపాటి వ్యాపారులు, ప్రైవేట్ కంపెనీలో 10-15 వేల నెల జీతగాళ్లే. ఇందులోనే ఇంటి ఖర్చులు పోను తాము చేసే కార్యక్రమానికి తలాకొంత వేసుకుంటూ అనుకున్న కార్యం గట్టెక్కించేలా ముందుకు సాగారు. తమ హీరో, నాయకుల పుట్టిన రోజుల నాడు పేదలకు, ఆసుపత్రుల్లో రోగులకు అరటి పండు, ఒక బ్రెడ్డు ముక్క ఇస్తేనే ఫొటోలకు ఫోజులిచ్చి పబ్లిసిటీ కోసం పాకులాడే రోజులివి. కానీ వీరి సేవలను పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం వీరికి తెలీదు. కేవలం వాట్సాప్ గ్రూపులో తమ కార్యక్రమాలను మిత్రులకు, శ్రేయోభిలాషులకు పంపి తృప్తి చెందుతారు. వీరి సేవల్లో నిజాయితీ ఉండటంతో మేము సైతం అంటూ జిల్లా నలు మూలల నుంచి శ్రీ సుమఖీ అన్నపూర్ణేశ్వరీ సమితిలో సభ్యులుగా చేరుతున్నారు. ఇందులో ఇప్పుడు దాదాపు 300 మంది ఉన్నారు. వీరంతా కుటుంబంలా మారి సేవా కార్యక్రమాలు చేస్తున్నారు.


పేదలకు వితరణ కోసం సిద్ధంగా ఉన్న దుప్పట్లు


గుడి-బడి శుభ్రతకు సిద్ధంగా ఉన్న కమిటీ సభ్యులు

కలసి పనిచేసేందుకు కార్యాలయమే లేదు

జిల్లాలో మూడేళ్ల కాలంలో అనాధలకు, హాస్టళ్లలో ఉన్న పేద విద్యార్థులకు చాలాసార్లు మృష్టాన్నభోజన సమర్పణ చేశారు. బెడ్‌షీట్లు, పండ్లు, వేసవిలో చల్లని మజ్జిగ పంపిణీ లాంటి దాదాపు 200కు పైగా కార్యక్రమాలు చేశారు. అందులో ఒక్కొక్క కార్యక్రమానికి రూ.5 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చు అయినా సరే ప్రతి నెలా క్రమం తప్పకుండా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ఒక కార్యక్రమం చేసే ముందు వాట్సాప్ గ్రూపులో సభ్యులకు తెలియజేస్తారు. అంతే మానవతావాదులంతా తలో చేయి వే స్తారు. అంతివ్వాలి.. ఇంతివ్వాలనే నిబంధన లేకుండా ఎవరికి తోచిన మేరకు సాయం అందించి ఆ కార్యాన్ని గట్టెక్కిస్తున్నారు.

ఇంతటి సేవా కార్యక్రమాలు చేస్తున్న వీరు కూర్చుని మాట్లాడుకునేందుకు జిల్లా కేంద్రంలో ఎలాంటి కార్యాలయం లేదు. వీరంతా కడపలోని పార్కుల్లో, టీకొట్ల వద్దనో కూర్చొని తాము చేయాల్సిన కార్యకలాపాలను గూర్చి చర్చించుకుంటారు. ఇటీవలనే నూతనంగా శ్రీ సుమఖీ అన్న పూర్ణేశ్వరీ సేవా సమితిని రిజిస్టర్ చేసుకున్నారు. తమ సమితికి జిల్లా కేంద్రంలో ప్రభుత్వం సొంత స్థలం ఇస్తే కార్యాలయం ఏర్పాటు చేసుకుని సేవలను మరింత విస్తరిస్తామని వీరు అంటున్నారు.

విద్య, ఆధ్యాత్మిక సేవలు విస్తరిస్తాం

పేదలకు, అనాధలకు, హాస్టల్ విద్యార్థులకు ఇంటి భోజనంలా అన్నసమర్పణ చేస్తున్నాం. ఇప్పటికే వృద్ధాశ్రమాలు, రిమ్స్ ఆసుపత్రికి వచ్చేవారికి, కార్తీక మాసంలో దేవాలయాల వద్ద అన్నసమర్పణ చేస్తున్నాం. పేదల విద్యకు అధిక ప్రాధాన్యతతో పాటు యువతను సన్మార్గంలో పెట్టేందుకు ఆధ్యాత్మికత వైపు నడిపించే ఆలోచనలో ఉన్నాం. విద్యను ప్రోత్సహించేలా సేవలను విస్తరించే ప్రయత్నం చేస్తున్నాం.

- పరమేశ్వరరెడ్డి, జిల్లా అధ్యక్షుడు

స్థలం కేటాయిస్తే మరిన్ని సేవలు

పేదలకు, అనాధలకు స్వంత ఖర్చులతో సభ్యుల సహకారంతో అన్న సమర్పణ లాంటివి చేస్తున్నాం. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలనే సంకల్పంతో ఉన్నాం. ఐదుగురితో ప్రారంభమైన మా సేవలు, ఈ రోజు జిల్లాలో 300 మందికి చేరుకుంది. మేము సేవలను విస్తరించేందుకు, కలసి చర్చించుకునేందుకు కార్యాలయం లేదు. ప్రభుత్వం కొంత స్థలం కేటాయిస్తే మాసేవలను మరింత విస్తరిస్తాం.

- రామమూర్తి, గౌరవాధ్యక్షుడు

గుడులు బడుల శుభ్రత పుణ్యకార్యం

పేదలకు భోజన సమర్పణ ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. ఆదరణకు నోచుకోని గుడులు బడులు పరిశుభ్రం చేయడం పుణ్య కార్యక్రమం. ఇలాంటి కార్యక్రమాలకు నాతో పాటు పిలిచిన వెంటనే 50 మందికి పైగా సభ్యులు రావడం, అందరు కలసి సేవా కార్యక్రమంలో పాలు పంచుకోవడం పూర్వజన్మ సుకృతం. శిధిలావస్థలో ఉన్న గుడుల శుభ్రత విషయంలో మమ్మల్ని సంప్రదిస్తే స్వంతఖర్చులతో వచ్చి శుభ్ర పరుస్తున్నాం.

- మైదుకూరు లక్ష్మీదేవి, సంఘ ఉపాధ్యక్షురాలు

మండల స్థాయిలో సేవలు జరిగేలా కమిటీలు


మా సంస్థ ద్వారా పేదలకు చేతనైన సహాయం చేస్తున్నాం. గతంలో సేవలు సాగించాలంటే చాలా ఆర్థిక ఇబ్బందులు ఉండేవి. ఇప్పుడు ఉద్యోగులు, పదవీ విరమణ చేసిన వారు, చిన్న, పెద్ద వ్యాపారులు, సామాన్య కూలీలు, ప్రైవేట్ సంస్థ ఉద్యోగులు సహకారం అందిస్తున్నారు. సేవా కార్యక్రమాలు మండల, నియోజకవర్గ స్థాయిలో విస్తరించేలా కమిటీలు ఏర్పాటు చేస్తున్నాం.

- సుబ్రమణ్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి

రేణిగుంట విమానాశ్రయానికి

అంతర్జాతీయ హోదా కల్పించాలి

● కేంద్ర మంత్రులకు బీజేపీ ఇన్‌చార్జి వినతి


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా కల్పించాలని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడును కోడూరు బీజేపీ ఇన్‌చార్జి గడ్డం చంగల్రాజు డిల్లీలో వినతిపత్రం అందజేశారు. శనివారం ఫోన్ ద్వారా మాట్లాడుతూ రైల్వేకోడూరు, రాయచోటి, కడప, బద్వేలు తదితర ప్రాంతాల నుంచి కువైత్, ఖతార్, సౌదీ, బెహరిన్, దుబాయ్ తదితర దేశాలకు పొట్టకూటి కోసం వేలాది మంది వెళుతుంటారని కేంద్ర మంత్రులకు విన్నవించామని తెలిపారు. విమానయాన సహాయ మంత్రి మురళీధర్ మొహోల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. రైల్వేకోడూరులో పలు రైళ్లు ఆగకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలపగా ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. రైల్వే సహాయ మంత్రి వి.సోమన్నకు కూడా వినతిపత్రం అందజేశామని తెలిపారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి సమస్యలపై కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్‌కు వినతిపత్రాన్ని సమర్పించామని తెలిపారు. కేంద్ర మంత్రులందరు సానుకూలంగా స్పందించారన్నారు. రేణిగుంట నుంచి కనెక్టింగ్ విమాన సర్వీసులు ప్రారంభించేందుకు ప్రణాళిక సిద్ధం అవుతుందన్నారు. రేణిగుంట నుంచి బెంగుళూరు, లేదా రేణిగుంట నుంచి హైద్రాబాద్ వెళ్లి అక్కడి నుంచి కువైట్‌కు వెళ్లేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు.

'పరీక్షా పే చర్చ'ను విజయవంతం చేద్దాం

రాయచోటిటౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పరీక్షా పే చర్చా-2025 కార్యక్రమం విజయవంతానికి జిల్లాలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, జూనియర్ కళాశాలల అధ్యాపకులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంఆర్‌ఎస్ అజయ్‌కుమార్‌బాబు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, కళాశాలల్లో 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఈ పరీక్షా పే చర్చా కార్యక్రమంలో భాగస్వాములను చేయాలన్నారు. విద్యాపరమైన సవాళ్లకు వినూత్న పరిష్కారాలను చర్చించడానికి దేశవ్యాప్తంగా పాల్గొనే వారిని ఎంపిక చేసి, వారిని ఈవెంట్‌లో ప్రశ్నలు అడగడానికి, ప్రధాన మంత్రితో నేరుగా ఇంటరాక్ట్ అయ్యే అవకాశం కల్పిస్తుందన్నారు. ఇందుకోసం ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 6 నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులు వారి తల్లిదండ్రులకు ఆహ్వానం పలుకుతు న్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ 2025 జనవరి 14వ తేదీ వరకు ఉంటుందన్నారు. కార్యక్రమానికి ఎంపికైన వారికి ఈ మెయిల్, ఎస్‌ఎంఎస్ ద్వారా సమాచారం తెలియజేస్తారన్నారు. మరిన్ని వివరాల కోసం రాయచోటి డైట్ అధ్యాపకుడు ఎం. నాగరాజు (9000910805), అసదుల్లా (9440084715)లకు ఫోన్ చేసి సందేహాలుంటే తెలియజేయాలని తెలిపారు.

నాడు జిల్లా కోట.. నేడు శిథిలాల బాట

● మంత్రి రాకతో సిద్దవటం కోటకు పూర్వవైభవం వచ్చేనా..! ● నేడు మంత్రి కందుల దుర్గేష్ రాక


పిచ్చిమొక్కలతో నిండిపోయిన కోట చుట్టూ ఉన్న కందకం


దెబ్బతిని శిథిలావస్థకు చేరుకున్న కోట గోడలు

సిద్దవటం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఒకనాటి జిల్లా కేంద్రమైన సిద్దవటం అంటే టక్కున గుర్తు వచ్చేది కోటే. అలనాటి సిద్దవటం కోట సంస్కృతీ, సంప్రదాయాలను, శిలాసంపదను నాటి ఔన్నత్యాన్ని అలనాటి రాచరికపు వ్యవస్థను ప్రతిబింబిస్తోంది. ఆనాడు దేశంలోనే ఎంతో గుర్తింపు పొందిన ఈ కోట సొగసులు నేడు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. అయినా పట్టించుకునేవారు కరయ్యారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మృతి చెందిన కౌలు రైతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం మంజూరు చేయడానికి పవన్‌కళ్యాణ్ సిద్దవటం వచ్చారు. అప్పట్లో సిద్దవటం కోటను అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఆ హామీలో భాగంగా పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ ఆదివారం సిద్దవటం కోటను సందర్శించనున్నారు. శిథిలాలబాట పట్టిన సిద్దవటం కోటను పర్యాటకులకు అందుబాటులో ఉంచడంతో పాటు కోట చుట్టూ ఉన్న కందకంలో బోటింగ్ ఏర్పాటు చేసి, దెబ్బతిన్న ప్రహరీగోడను మరమ్మతులు చేయడానికి చర్యలు తీసుకుంటారని తెలిసింది. వీటితో పాటు రాత్రి 10 గంటలు దాటితే అటవీశాఖ చెక్‌పోస్టును వాహనాలు తిరగకుండా ఫారెస్ట్ గేటును మూయడంతో పలు మండలాల వాసులు ఇబ్బందులకు గురవుతున్నారని, లంకమల్ల అభయారణ్య అడవుల్లో వెలసిన నిత్య పూజేశ్వరస్వామి కోనకు వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతినడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారని వాటిపై కూడా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. మాచుపల్లె ఖాదర్ బంగ్లా వంతెన నిర్మాణం అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు కోటి రూపాయల వ్యయంతో శంకుస్థాపన చేసి నేటికి 37 ఏళ్లు అయినా అది కలగానే మిగిలిపోయింది. వీటన్నింటిపైన పర్యాటకశాఖ మంత్రి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రెడ్డివారిపల్లె-కోడూరు మధ్య రాకపోకలు



రెడ్డివారిపల్లె-రైల్వేకోడూరు మధ్య తాత్కాలిక రోడ్డును సిద్ధం చేసిన దృశ్యం

● తాత్కాలిక రోడ్డుకు మరమ్మతులు

రైల్వేకోడూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గత 20 రోజులుగా కురిసిన భారీ వర్షాల కారణంగా రైల్వేకోడూరు-రెడ్డివారిపల్లె తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలు బంద్ అయ్యాయి. ఈ విషయంపై గత గురువారం ఆంధ్రజ్యోతిలో మూడు గ్రామాలకు రాకపోకలు బంద్ అన్న శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దీంతో శనివారం రెడ్డివారిపల్లె-రైల్వేకోడూరు మార్గంలో నిర్మించిన తాత్కాలిక రోడ్డుకు రోడ్లు భవనాల శాఖ డీఈ జయప్రసాద్ ఆదేశాల మేరకు కాంట్రాక్టర్ పాములపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో తాత్కాలిక రోడ్డు కు మరమ్మతులు చేశారు. ప్రజల రాకపోకలు ప్రారంభమయ్యాయి. గుర్రపాళెం-రైల్వేకోడూరు, తూర్పుపల్లె-పాట్టావాండ్లపల్లె మధ్య రాకపోకలు బంద్ అయిన విషయం తెలిసిందే. వాటికి కూడా తాత్కాలిక రోడ్లు ఏర్పాటు చేస్తామని రోడ్లు, భవనాల శాఖ అధికారులు తెలిపారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ చిన్నారిని

అభినందించిన కలెక్టర్


బాలుడిని అభినందిస్తున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించిన రాజంపేట ముకుందర్‌గడ్డకు చెందిన వీఆర్‌వో షేక్ ముజీబ్, షేక్ మసూదాబేగం దంపతుల కుమారుడు షేక్ మహమ్మద్‌ముష్తాక్ సిద్దికిని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు. శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను చిన్నారి తల్లిదండ్రులు కలిశారు. చిన్నారిని మరింత ప్రోత్స హించాలని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అందుకునేలా బాగా చదివించాలని కలెక్టర్ తెలిపారు.

నలుగురు వైద్యాధికారులకు పదోన్నతులు

కలికిరి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కడప, అన్నమయ్య జిల్లాల్లో పనిచేస్తున్న నలుగురు వైద్యాధికారులకు పదోన్నతులు కల్పించి నియమకాలు కల్పించారు. శనివారం ప్రభుత్వం ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా పదోన్నతులు పొందిన డిప్యూటీ సివిల్ సర్జన్ల నుంచి సివిల్ సర్జన్‌లుగా పదోన్నతులు పొందిన వైద్యాధికారుల జాబితాను విడుదల చేసింది. ప్రస్తుతం డిప్యూటీ సివిల్ సర్జన్ స్థాయిలో పనిచేస్తున్న ఈ నలుగురికీ సివిల్ సర్జన్ హోదా కల్పించి వివిధ పోస్టుల్లో నియమించారు. వాయల్పాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో వైద్యాధికారిగా పనిచేస్తున్న డాక్టర్ ఎస్. ఫైరోజా బేగంకు పదోన్నతి కల్పించి శ్రీసత్యసాయి పుట్టపర్తి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో)గా నియమించారు. ప్రకాశం జిల్లా మార్కాపురం డిప్యూటీ డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్న డాక్టర్ కె. పద్మావతిని కడప 300 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో సీఎస్ఆర్వోగా నియమించారు. తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలలో రీ ఓరియెంటేషన్ ఆఫ్ మెడికల ఎడ్యుకేషన్ విభాగంలో పని చేస్తున్న డాక్టర్ జె.రామాంజనేయులును కడప క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో సీఎస్‌ఆర్ ఎంవో (సివిల్ సర్జన్ రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్)గా నియమించారు.అదే విధంగా కడప జిల్లా జమ్మలమడుగు డిప్యూటీ డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్న డాక్టర్ పి. శాంతికళను కర్నూలు జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో)గా నియమించారు. పదోన్నతులతో నియామకాలు పొందిన వారు 15 రోజుల్లోగా బాధ్యతల్లో చేరాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు శనివారం పదోన్నతుల జాబితాలకు సంబంధించిన ఆదేశాలు జారీ చేశారు.

సమగ్ర శిక్ష అధికారుల నియామకం

కడప, అన్నమయ్య జిల్లాల సమగ్ర శిక్షకు ఇద్దరు అధికారులను అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్లుగా నియమిస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డిప్యూటీ కలెక్టరుగా పనిచేస్తున్న ఎ.నిత్యానందరాజును కడప సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్‌గా నియమించారు.

చిత్తూరు జిల్లా పలమనేరు ఎస్వీసీఆర్ ప్రభుత్వ కళాశాలలో పొలిటికల్ సైన్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న బి.నాగరత్నంరెడ్డిని అన్నమయ్య జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా నియమించారు. ఇరువురూ ఏడాదిపాటు ఏపీడీలుగా కొనసాగుతారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


సంఘటనాస్థలంలో ప్రకాశ్ మృతదేహం

కురబలకోట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంగళ్లు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి.

మదనపల్లె పట్టణం రామారావు కాలనీకి చెందిన యువకుడు ప్రకాశ్ (21) మండలంలోని అంగళ్లులో సెలూన్ దుకాణంలో పని చేస్తున్నాడు. ఇతను పనులు ముగించుకుని ద్విచక్రవాహనంలో ఇంటికి వెళుతుండగా మార్గమధ్యంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. ఈ మేరకు ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి


కంబాల ప్రసాద్ (ఫైల్)

రైల్వేకోడూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బెంగుళూరులో పీజీ హాస్టల్‌లో చేరడానికి వెళ్లి ఓ యువకుడు శవమై వచ్చాడు. వివరాలిలా ఉన్నాయి. రైల్వేకోడూరు పంచాయతీ పరిధిలో ఉన్న ఉన్న పగడాలపల్లెలో కంబాల సుబ్బరాయుడు, లక్ష్మీదేవిల రెండో కుమారుడు కంబాల ప్రసాద్ (22) అనే యువకుడు గత నెలలో బెంగళూరులో ఎంబీఏ చేరడానికి వెళ్లి అడ్మిషన్ తీసుకుని వచ్చేశాడు. ఈనెల 7వ తేది మళ్లీ బెంగళూరుకు తన మోటారు సైకిల్‌లో వెళ్లి పీజీ హస్టల్‌లో ఉండడానికి అన్ని మాట్లాడుకుని 9 తేది తెల్లవారుజామున తన స్నేహితుడు రెడ్డయ్యతో కలసి రైల్వేకోడూరుకు వస్తుండగా చిత్తూరు జిల్లా బంగారుపాళెం సమీపంలో ఉన్న డివైడర్‌ను ఢీకొట్టడంతో ప్రసాద్ తలకు తీవ్రమైన గాయమైంది. తన స్నేహితుడు రెడ్డయ్యకు చేతికి గాయమై బయటపడ్డాడు. కుటుంబ సభ్యులు, స్నేహితులు అతడిని వేలూరు సీఎంసీకి తరలించారు. అక్కడ 5 రోజుల పాటు చికిత్స పొందాడు. అక్కడి నుంచి రేణిగుంట సమీపంలో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ 3 రోజుల పాటు చికిత్స పొంది శనివారం ఉదయం మృతి చెందాడు. దీంతో పగడాలపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఈ-పరిపాలనను వందశాతం అమలు చేయాలి

కడప రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ శాఖలో ఈ-పరిపాలనను వందశాతం అమలు చేయాలని జడ్పీ సీఈవో ఓబులమ్మ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఈ-ఆఫీస్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ-ఆఫీస్ వినియోగంపై సంబంధిత అధికారులు అవగాహనను పెంపొందించుకోవాలన్నారు. ఈ-పరిపాలన ద్వారా కార్యాలయ పరిపాలనను మరింత సులభతరం చేస్తామన్నారు. ప్రధానంగా ఎంపీడీవోలు, ఏవోలు, టైపిస్టులు ఈ-పరిపాలనపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కడప జిల్లాలోని ఎంపీడీవోలు, పరిపాలనాధికారులు (ఏవోలు), టైపిస్టులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు ఎక్కడివక్కడే..

- రూ.454 కోట్ల జీవో ఇచ్చి పరిహారాన్ని గాలికొదిలేసిన వైసీపీ సర్కారు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు
- పరిహారం కోసం గండికోట నిర్వాసితుల ఎదురుచూపు
- నేడు మంత్రి నిమ్మల గండికోట ప్రాజెక్టు సందర్శన


గండికోట ప్రాజెక్టు

కొండాపురం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గండికోట నిర్వాసితుల సమస్యలను పరిష్కరించడంలో గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని చెప్పవచ్చు. గత ప్రభుత్వం సమస్యలు గాలికొదిలేయడంతో నిర్వాసితులు పరిహారం, మౌలిక సదుపాయాల కోసం కూటమి ప్రభుత్వం పైనే ఆశలు పెంచుకున్నారు. ఆదివారం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గండికోట ప్రాజెక్టును సందర్శించనున్న నేపథ్యంలో తమ సమస్యలను పరిష్కరించాలని గండికోట నిర్వాసితులు మంత్రిని కోరుతున్నారు.

రూ.454 కోట్ల పరిహారానికి జీవో ఇచ్చి గాలికొదిలేసి..

గండికోట ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో నీళ్లు తామే మొదటిసారిగా నింపినట్లు గొప్పలు చెప్పుకున్న గత వైసీపీ ప్రభుత్వం నిర్వాసితులకు పరిహారం చెల్లించడంలో పూర్తిగా విఫలమైంది. ఎన్నికలకు తొమ్మిది నెలల ముందు 6.7.2023న గండికోట నిర్వాసితుల పరిహారం కోసం రూ.454.6 కోట్లు విడుదల చేయనున్నట్లు జీవో ఇచ్చింది. మొదటి విడత 14 ముంపు గ్రామాలకు అదనపు పరిహారం కింద ఒక్కొక్కరికి రూ. 3,25,000 చొప్పున 9096 మంది నిర్వాసితులకు గాను రూ.295.62 కోట్లు విడుదల చేయనున్నట్లు జీవోలో ఉంది. అదే విధంగా రెండో విడత 8 గ్రామాల్లో పెండింగ్ ఉన్న 573 మంది నిర్వాసితులకు రూ.58.3 కోట్లు ఇవ్వనున్నట్లు తెలిపింది. కొండాపురం పట్టణంలో సప్లిమెంటరీ జాబితా కింద 547 మంది నిర్వాసితులకు రూ.53.86 కోట్లు ఇస్తామంది. అదే విధంగా మొదటివిడత 14 ముంపు గ్రామాల్లో పూర్తి గా పరిహారం అందని నిర్వాసితులకు 46.77 కోట్లు ఇవ్వనున్నట్లు జీవోలో తెలిపింది. మొత్తం 22 గ్రామాలకు పరిహారం కింద 18,204 నిర్వాసిత కుటుంబాలకు 454.6 కోట్లు విడుదల చేయనున్నట్లు జీవోలో పేర్కొంది. ఈ జీవోకు సంబంధించి కనీసం ఒక్క రూపాయి కూడా పరిహారాన్ని నిర్వాసితులకు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం చేతులెత్తేసింది. దీంతో పరిహారం కోసం నిర్వాసితులు కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు.

వైసీపీ ప్రభుత్వం కక్షగట్టి పరిహారం ఇవ్వలేదు

గత వైసీపీ ప్రభుత్వంలో ముంపువాసుల సమస్యలను లేవనెత్తడంతో నాపై కక్షగట్టింది. నాకు రావలసిన రూ.7 లక్షల పరిహారాన్ని, భూమికి రూ.2 లక్షలు పరిహారాన్ని ఇవ్వకుండా గత ఐదేళ్లు ఆపేశారు. కూటమి ప్రభుత్వం నాతో పాటు నిర్వాసితులకు వెంటనే పరిహారం ఇవ్వాలి.

- బుగ్గన చంద్రశేఖర్‌రెడ్డి, మండల టీడీపీ ఉపాధ్యక్షుడు, తాళ్లప్రొద్దుటూరు

మౌలిక సదుపాయాలు నిల్

గండికోట నిర్వాసితులకు మౌలిక సదుపాయాలను కల్పించడంలోనూ గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. పునరావాస కాలనీల్లో పాఠశాలలు, దేవాలయాలు, రోడ్లు, డ్రైనీజీలు, శ్మశానవాటికలు ఇలా అన్ని వసతులు అసంపూర్తిగానే ఉన్నాయి. వెంటనే మంత్రి చొరవ తీసుకొని వాటిని పరిష్కరించాలని నిర్వాసితులు కోరుతున్నారు.



తాళ్లప్రొద్దుటూరు రేకులషెడ్డులో నడుపుతున్న ప్రైమరీస్కూల్, (ఇన్‌సెట్లో) పునరావాస కాలనీలో రోడ్ల దుస్థితి

గండికోట నిర్వాసితుల సమస్యల్లో ముఖ్యమైనవి కొన్ని

- నిర్వాసితులకు జీవోలో ఉన్న విధంగా రూ.454.6 కోట్లు పరిహారం ఇవ్వాలి.
- పునరావాస కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి.
- దత్తాపురం, చౌటిపల్లె ముంపునకు గురి కాక ముందు ఉన్న పంచాయతీలు యదాతథంగా ఉంచాలి.
- పునరాసం కింద పరిహారంలో కోతవిధించిన రూ.1,85,000 చెల్లించాలి.
- పరిహారం గల్లంతైన నిర్వాసితులకు తిరిగి సర్వే చేసి పరిహారం ఇవ్వాలి.
- కొండాపురం పట్టణంలో ముంపునకు గురైన ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించాలి.
- కొండాపురం జడ్పీహైస్కూల్, అసంపూర్తిగా ఉన్న తాళ్లప్రొద్దుటూరు హైస్కూల్, ప్రైమరీ స్కూలు వెంటనే పూర్తి చేయాలి.
- మంత్రి లోకేశ్ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు నిర్వాసితుల ఉపాధికి పరిశ్రమ స్థాపించాలి.
- గండికోట ప్రాజెక్టుకు పర్యాటక అభివృద్ధి చేయాలి. బోటింగ్ సౌకర్యం కల్పించాలి.
- సోమశిల ముంపువాసుల మాదిరి గండికోట నిర్వాసితులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలి.

నేడు గండికోట ప్రాజెక్టును సందర్శించనున్న మంత్రి నిమ్మల

కొండాపురం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదివారం గండికోట ప్రాజెక్టును సందర్శించనున్నట్లు జలవనరులశాఖ ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు.మచిలీపట్నం-ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలులో ఆయన ఉదయం 4.00 గంటలకు జమ్మలమడుగు చేరుకుంటారన్నారు. 4.30 గంటలకు జమ్మలమడుగు సమీపంలోని చారిత్మక గండికోట వద్ద నున్న హరితా రెస్టారెంటుకు చేరుకొని విశ్రాంతి తీసుకుంటారన్నారు. ఉదయం 8.30 గంటలకు అక్కడ నుండి బయలుదేరి రోడ్డు మార్గాన గండికోట ప్రాజెక్టుకు చేరుకుంటారన్నారు. గండికోట ప్రాజెక్టు, సొరంగం లను పరిశీలీస్తారన్నారు. అనంతరం అధికారులతో, మీడీయూ ప్రతినిధులతో సమావేశం అవుతారన్నారు. అక్కడి నుండి మధ్యాహ్నం 2 గంటలకు కడపకు చేరుకొని మేడాఫంక్షన్ హాలులో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారని ఈఈ తెలిపారు.అదేవిధంగా మంత్రితో పాటు ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, జమ్మలమడుగు టీడీపీ ఇన్‌ఛార్జ్ భూపేశ్‌రెడ్డిలు పాల్గొంటారని మంత్రి పర్యటన విజయవంతం చేయాలని మండల కూటమి ఇన్‌ఛార్జ్ దేవగుడి శివనారాయణరెడ్డి తెలిపారు.

ఊహించినట్లే జరిగింది..!

- హెచ్చెల్సీ ప్రాజెక్ట్ ఛైర్మన్‌గా జిల్లాకు చెందిన జోగిరెడ్డి ఏకగ్రీవం
- వైస్ ఛైర్మన్‌గా అనంతపురం జిల్లాకు చెందిన కేశవరెడ్డి


హెచ్చెల్సీ ప్రాజెక్ట్ ఛైర్మన్ జోగిరెడ్డి, వైస్ ఛైర్మన్ కేశవరెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్/ సింహాద్రిపురం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఊహించినట్లుగానే తుంగభద్ర ప్రాజెక్ట్ ఎగువ కాలువ (టీబీపీ హెచ్చెల్సీ) కమిటీ ఎన్నికైంది. కడప జిల్లాకు ఛైర్మన్, అనంతపురం జిల్లాకు వైస్‌ఛైర్మన్ పదవులు దక్కాయి. రెండేళ్ల పాటు ఒకరు, మరో మూడేళ్ల పాటు మరొకరు పదవుల్లో కొనసాగేలా పరస్పర అంగీకారంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని హెచ్చెల్సీ లోక్ డివిజన్ కార్యాలయంలో శనివారం హెచ్చెల్సీ ప్రాజెక్ట్ కమిటీ ఎన్నిక నిర్వహించారు. హెచ్చెల్సీ ఎస్‌ఈ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. అనంతపురం జిల్లాలోని 5డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఛైర్మన్‌లు హెచ్‌ఎల్‌ఎంసీ కొండాపురం కేశవరెడ్డి, మిడ్‌పెన్నార్ సౌత్‌కెనాల్ డీసీ (డిస్ట్రిబ్యూటరీ కమిటీ) కొర్రపాటి శేఖర్, మిడ్‌పెన్నార్ నార్త్ కెనాల్ డీసీ రాజారెడ్డి, తాడిపత్రి బ్రాంచ్ కెనాల్ డీసీ కుమెత ప్రమీలమ్మ, గుంతకల్లు బ్రాంచ్‌కెనాల్ డీసీ బొమ్మయ్యగారి మారయ్య హాజరయ్యారు. కర్నూలు జిల్లా ఆలూరు బ్రాంచ్ కెనాల్ డీసీ నగరడోన కిష్టప్ప హాజరయ్యారు. కడప జిల్లా నుంచి కసనూరు డీసీ మారెడ్డి జోగిరెడ్డి, సింహాద్రిపురం డీసీ ఎర్రంరెడ్డి సూర్యశేఖర్‌రెడ్డి, వేంపల్లి డీసీ అన్నారెడ్డి వెంకట లక్ష్మిరెడ్డి, పెద్దముడియం డీసీ మాధవరెడ్డి, రాజుపాలెం డీసీ భూటూరు వెంకటజయరామిరెడ్డి, పోట్లదుర్తి డీసీ ఎద్దుల వెంకట సుధాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులకు ఒక్కొక్క నామినేషన్ రావడంతో కడప జిల్లా కసనూరు డిస్టిబ్యూటరీ ఛైర్మన్ మారెడ్డి జోగిరెడ్డిని(ఓసీ) ఛైర్మన్‌గా, వైస్ ఛైర్మన్‌గా అనంతపురం జిల్లా హెచ్‌ఎల్‌ఎంసీ డిస్ట్రిబ్యూటరీ ఛైర్మన్ కొండాపురం కేశవరెడ్డి (బీసీ)ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీలో ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లతో పాటు మిగిలిన 10 డిస్ట్రిబ్యూటరీల ఛైర్మన్లు సభ్యులుగా కొనసాగుతారు. ఎన్నికైన కమిటీని పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి, అనంతపురం జిల్లా టీడీపీ అధ్యక్షుడు వెంకట శివుడుయాదవ్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, శింగనమల ద్విసభ్యకమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి తదితరులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. హెచ్చెల్సీ ఎస్‌ఈ రాజశేఖర్‌ను నూతన కమిటీ సభ్యులు పుష్పగుచ్ఛం, శాలువాతో సన్మానించారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య


ఉరివేసుకోని ఆత్మహత్య చేసుకున్న నరేష్‌కుమార్

ప్రొద్దుటూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై అప్పులపాలై నరేష్ కుమార్ (42) అనే వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం అమృతనగర్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నరేష్ కుమార్ అమృతనగర్‌లో నివాసం వుంటూ ఆటోనడుపుతూ జీవనం కొనసాగించేవాడు. నరేష్ మద్యానికి బానిసై అప్పులు చేశాడు. అప్పు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడిని తట్టుకోలేక ఇంట్లో రేకుల పైపులకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు. నరేష్‌కు భార్య, ఒక కుమారుడు వున్నారు. భార్య గౌరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు సన్నపురెడ్డికి కేతు పురస్కారం ప్రదానం

కడప కల్చరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): యర్రముక్కపల్లిలోని సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి స్మారక జీవన సాఫల్య పురస్కారాన్ని కథ, నవల రచయిత సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డికి ప్రదానం చేయనున్నట్లు కవిత విద్య సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షులు అలపర్తి పిచ్చయ్య చౌదరి తెలిపారు. తమ సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ కార్యక్రమానికి పలువురు సాహితీ ప్రముఖులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. జిల్లాలోని కవులు, రచయితలు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఏఐఎస్‌ఎఫ్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ చదువుతున్న విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన డబ్బులు విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పూలరాజు డిమాండ్ చేశారు. శనివారం కడప కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో నారాలోకేశ్ ఇచ్చిన హామీ జీఓ 77 రద్దు చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.2100 కోట్లు, వసతిదీవెన రూ.1480కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పైబడినా ఇంతవరకు జీఓ నెంబర్ 77పై మాట్లాడడం లేదన్నారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కె.శివశంకర్, జిల్లా సహాయ కార్యదర్శి చంద్ర, అరుణ్, నగర అధ్యక్ష కార్యదర్శులు అఖిరానందన్, తేజ, నగర నాయకులు అశోక్, శమంత్, నిఖిల్, రాజేష్, మస్తాన్, సల్మాన్, ఈశ్వర్‌రెడ్డి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులకు పార్టీ అండగా ఉంటుంది

మదనపల్లె టౌన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులకు పార్టీ అధిష్టానం ఎల్లవేళలా అందుబాటులో వుంటుందని మదనపల్లె మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో మాలేపాడుకు చెందిన టీడీపీ నాయకులు రమేశ్, గణేష్‌లను దొమ్మలపాటి పరామర్శించారు. ఈ సందర్భంగా నల్లరాజు గారిపల్లెలో శుక్రవారం రాత్రి జగన్ ఫ్లెక్సీ బ్యానర్ల ఏర్పాటు విషయమై టీడీపీ నాయకులపై వైసీపీ నాయకులు హత్యాయత్నానికి ఒడిగట్టడాన్ని రమేశ్ ఖండించారు. ఈ విషయమై పార్టీ అధిష్టానం సీరియస్‌గా తీసుకుందని, దాడి చేసిన వైసీపీ నాయకులపై కఠినంగా చర్యలు తీసుకోవాల్సిందిగా పోలీసులను కోరామన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి దాడులు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు దేవరింటి శ్రీనివాసులు, క్లస్టర్ ఇన్‌చార్జి మేకల రెడ్డిశేఖర్, ఎస్‌ఎల్‌వీ రఘు, సాయిచిత్ర భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వాస్పత్రిలో టీడీపీ నాయకులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి, టీడీపీ నాయకులు

ఉజ్వల భవిష్యత్తుకు జ్ఞాన కేంద్రం

- వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి


సభావేదికపై హాజరైన ముఖ్యఅతిథులు

కడపఎడ్యుకేషన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కన్నవారి ఆకాంక్షలను నెరవేర్చి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకునేందుకు విద్యార్థులకు యోగివేమన విశ్వవిద్యాలయం చక్కటి జ్ఞాన కేంద్రం అని యోగివేమన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. శనివారం యోగివేమన విశ్వవిద్యాలయంలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఇండక్షన్ (ప్రేరణ) కార్యక్రమం ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. ఉపకులపతి మాట్లాడుతూ విద్య కోసం ప్రభుత్వం ఎంతో ఖర్చు చేస్తోందని మీరు ప్రయోజకులై సమాజ అభివృద్ధికి ఖర్చు చేయాలన్నారు. ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన ఫ్యాకల్టీ, విలువైన పుస్తకనిధి కలిగిన లైబ్రరీ ఉందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రిజిస్ట్రర్ ఆచార్య పి.పద్మ మాట్లాడుతూ దేశంలోని అత్యున్నత విశ్వవిద్యాలయంలో వైవీయూ ఒకటన్నారు. వైవీయూ విద్యార్థుల సమగ్రాభివృద్ధికి అద్భుతమైన వేదికన్నారు. ప్రధానాచార్యులు ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు కళాశాలలో లభించే వనరులు, సద్వినియోగం చేసుకొనే విధానం వివరించారు. గౌరవ అతిథులుగా రాజంపేట స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ శంకర్ మాట్లాడుతూ గురువు మందలిస్తున్నాడంటే మిమ్మల్ని ఉన్నతంగా మలుస్తున్నారని భావించాలన్నారు. అనంతరం చిన్మయ మిషన్ అధ్యక్షుడు తురియానంద స్వామి, తైక్వాండో శిక్షణ నిపుణుడు ఎం.నాగూర్‌బాబు, వ్యాయామ క్రీడల శాస్త్ర సంచాలకుడు కె.రామసుబ్బారెడ్డి ప్రసంగించారు.

ముగ్గురు దొంగలు అరెస్టు

- రూ.7 లక్షల విలువచేసే బంగారు ఆభరణాలు, కారు స్వాధీనం


విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు, పోలీసు సిబ్బంది

జమ్మలమడుగు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బంగారు నగలు చోరీ చేసిన కేసులో ముగ్గురు దొంగలను అరెస్టు చేసి, ఆభరణాలతో పాటు కారు స్వాధీనం చేసుకున్నట్లు జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం సాయంత్రం అర్బన్ పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 11న జమ్మలమడుగు పట్టణంలోని నేతాజీనగర్‌లో బి.చెన్నారెడ్డి ఇంటిలో మధ్యాహ్న సమయంలో ఇంటికి వేసిన తాళాలు పగులకొట్టి బీరువా పగులకొట్టి రూ.35 వేలు నగదు ఎత్తుకెళ్లినట్లు ఆయన తెలిపారు. అదే రోజు బాధితుల ఫిర్యాదు మేరకు కడప నుంచి వచ్చిన నిపుణులు ఫింగర్‌ప్రింట్ తీసుకోగా అందులో మెరుగుబాబు ఫింగర్‌ప్రింట్స్ దొరికాయన్నారు. గువ్వలచెరువు క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా రాబడిన సమాచారం మేరకు ఒక నంబరులేని కారులో వారు ప్రయాణిస్తూ దొరికారు. పై ముగ్గురిని అర్బన్ పోలీసుస్టేషన్‌కు తెచ్చి విచారణ చేయగా వారు మరికొన్ని కేసుల్లో ఉన్నట్లు తెలిసిందన్నారు. మెరుగుబాబు, రాబూరి అన్వేషి, పిల్లనారప్పగారి కళావతి జమ్మలమడుగు మండలంలోని రాజీవ్‌నగర్ కాలనీ గూడెం చెరువువాసులు. కాగా వారి వద్ద నుంచి 15 తులాల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నామన్నారు. రూ.20 వేలు నగదు, మొత్తం రూ.7 లక్షలు విలువచేసే ఒక కారు స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన నిందితులను కోర్టుకు హాజరుపరచనున్నట్లు డీఎస్పీ తెలిపారు. కేసును ఛేదించిన ఎస్‌ఐ రామక్రిష్ణ, పోలీసులు దేవదాసు, రియాజ్, రామాంజనేయరెడ్డిలకు ఎస్పీ, డీఎస్పీ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీఐలు లింగప్ప, గోపాల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ఆకస్మిక తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ

కడపక్రైం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కడప నగరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌ను శనివారం కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్‌లోని పలు రికార్డులు పరిశీలించారు. పెండింగు కేసుల వివరాలపై ఆరా తీశారు. నగరంలో పోలీసు 30 యాక్టు అమలులో ఉందని, అనుమతులు లేకుండా సభలు నిర్వహించరాదన్నారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. రానున్న డిసెంబరు 31న రాత్రి ఎక్కడా అల్లర్లు జరగకుండా చూడాలన్నారు. రాత్రి పూట మద్యం తాగి వాహనాలు ఇష్టానుసారంగా నడిపితే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ రామక్రిష్ణ, ఎస్‌ఐ అమర్‌నాథరెడ్డిలు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులపై అవగాహన పెంచుకోవాలి

మదనపల్లె టౌన్, డిసెంబరు 21(ఆంధ్ర జ్యోతి): మార్కెట్‌యార్డులో కార్మికుల హక్కుల గురించి అవగాహన పెంచుకో వాలని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఇర్ఫాన్ హుస్సేన్ పేర్కొన్నారు. శనివారం స్థానిక మార్కెట్‌యార్డులో టీఎన్‌టీయూసీ గౌరవాధ్యక్షుడు ఎస్‌ఏ మస్తాన్ ఆధ్వర్యంలో హమాలీ కార్మికులతో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సమావేశమై మాట్లాడుతూ టమోట యార్డులో కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత మండీ యజమానులపై ఉందన్నారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ కార్మిక సంఘం నాయకులు రామయ్య, రసూల్, నౌషాద్, చలపతి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద పిల్లలకు హెల్పింగ్ మైండ్స్ చేయూత

బి.కొత్తకోట, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట పట్టణ శివారులో గుడిసెలలో ఉంటున్న నిరుపేద పిల్లలకు పట్టణానికి చెందిన హెల్పింగ్‌మైండ్స్ సంస్థ ప్రతినిధులు చేయూత నందించారు. చిన్నపిల్లలకు స్వెటర్లు, దుప్పట్లను సమకూర్చారు. హెల్పింగ్ మైండ్స్ సభ్యులు ఫయాజ్, రెహమాన్, ఆరిఫ్, శీను, పవన్, నక్కామహేష్, అజహర్ పాల్గొన్నారు.









బీసీ వసతి గృహాలను ఏర్పాటు చేయండి

- మంత్రికి టీడీపీ బీసీ నేత సురేంద్రయాదవ్ వినతి


మంత్రి సవితను కలిసిన టీడీపీ బీసీ సెల్ నేత సురేంద్రయాదవ్

కురబలకోట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి):తంబళ్లపల్లె నియోజకవర్గంలో బీసీ వసతి గృహాలను ఏర్పాటు చేసి న్యాయం చేయాలని మంత్రి సవితను టీడీపీ రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్ కోరారు. మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో మంత్రిని కలిసిన ఆయన నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై వినతి పత్రం అందజేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో నియోజకవర్గానికి చెందిన పలువురు టీడీపీ నేతలపై అక్రమ కేసులు బనాయించారని, ఆ కేసుల నుంచి విముక్తి కల్పించి న్యాయం చేయాలని, పార్టీ కోసం కష్టపడిన వారికి గుర్తింపు ఇవ్వడంతో పాటుగా వారికి అన్ని విధాలా న్యాయం చేయాలని కోరమన్నారు.

'అమిత్‌షాను తక్షణం బర్తరఫ్ చేయాలి'


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎన్‌ఎస్‌యూఐ నాయకులు

పీలేరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్‌అం బేద్కర్‌పై అనుచిత వ్యా ఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా ను తక్షణమే మంత్రి వ ర్గం నుంచి బర్తరఫ్ చేయా లని ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దెల అమృతతేజ డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యలను వ్యతిరే కిస్తూ శనివారం ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటులో చేసిన వ్యాఖ్యల్ని సభా నాయ కుడిగా ఖండించాల్సిన ప్రధాన మంత్రి, అమిత్ షాను సమర్థించడం శోచనీయమన్నారు. అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలను అమిత్ షా వెనక్కు తీసుకునే వరకు నిరసనలు జరుగుతూనే ఉంటాయన్నారు. అనంతరం వారు అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎన్‌ఎస్‌యూఐ నాయకులు సాయి సంపత్ కుమార్, కాంగ్రెస్ నాయ కులు యూసుఫ్, తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ లేఅవుట్ పరిశీలించిన డీఈ

రామసముద్రం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంబకూరు పంచాయతీ హౌసింగ్ లేఅవుట్‌ను శనివారం హౌసింగ్ డీఈ రమేష్‌రెడ్డి, ఎంపీడీవో భాను ప్రసాద్ పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని డీఈ సూచించారు. పునాదులు, గోడల వరకు ఉన్న ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేస్తే వెంటనే బిల్లులు లబ్ధిదారుల ఖాతాలకు జమ చేయడం జరుగుతుందన్నారు. అలాగే చెంబకూరులోని సీసీ రోడ్ల పనులను ఎంపీడీవో భానుప్రసాద్, ఏపీవో గౌరీశంకర్ పరిశీలించి పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

27న పీలేరులో మినీ జాబ్ మేళా

పీలేరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పీలేరులోని సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 27న మినీ జాబ్ మేళా ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళా ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ జాబ్ మేళాలో 10వ తరగతి నుంచి పీజీ వరకు చదువుకున్న 18 నుంచి 30 ఏళ్ల మధ్యలో ఉన్న నిరుద్యోగులు అర్హులని ఆసక్తి గలవారు విద్యార్హతల సర్టిఫికెట్లు, ఆధార్ కార్డుతో 27న ఉదయం 10 గంటలకు కళాశాలకు రావాల న్నారు. మరిన్ని వివరాలకు 9966086996 సంప్రదించాలని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : ఎమ్మెల్యే


యల్లెల రెడ్డప్ప రెడ్డి, ఎన్‌ఎంయూఏ నాయకులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి

పీలేరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పీలేరు ఆర్టీసీ డిపో పరిధిలో ఉన్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్(ఎన్‌ఎంయూఏ) గౌరవాధ్యక్షుడుగా నియమితులైన యల్లెల రెడ్డప్పరెడ్డితో పాటు ఆ సంఘ నేతలను ఎమ్మెల్యే శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులకు గత ప్రభుత్వం నిలిపివేసిన నైట్ అలవెన్సులను కూటమి ప్రభుత్వం రాగానే మరలా మంజూరు చేసిందన్నారు. పీలేరు డిపోకు కొత్త బస్సులు మంజూరుతోపాటు దూరప్రాంత సర్వీసులకు అనుమతి వంటి అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తన వంతు ప్రయత్నం చేస్తామన్నారు. ఎన్‌ఎంయూఏ నూతన కార్యవర్గానికి ఎన్నికైన సభ్యులు కార్మికులు, ప్రభుత్వానికి అనుసంధానంగా ఉంటూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎంయూఏ రాష్ట్ర సహాయ కార్యదర్శి వినోద్ బాబు, అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి పీఎస్‌ఎం రాజు, జిల్లా ఉపాధ్యక్షురాలు ప్రమీలమ్మ, పీలేరు డిపో అధ్యక్షులు సీవీ రమణ పాల్గొన్నారు.

వసతి గృహాన్ని తనిఖీ చేసిన డీవీఎంసీ సభ్యులు

పీలేరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పీలేరు-మదనపల్లె రోడ్డులోని ఎస్సీ బాలికల సంక్షేమ వసతి గృహాన్ని శనివారం జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ(డీవీఎంసీ) సభ్యులు పాలకుంట శ్రీనివాసులు, బోదేషా వలి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహం వార్డెన్ రమాదేవితో కలిసి వంటశాల, విద్యార్థినుల వసతి గృహం, స్నానపు గదులు, మరుగుదొడ్లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిథిలావస్థకు చేరుకున్న బాలికల వసతి గృహం చిన్నపాటి వర్షానికి కూడా ఉరుస్తోందన్నారు. అరకొర వసతుల మధ్య విద్యార్థినులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. అనంతరం వారు వసతి గృహంలోని విద్యార్థినుల సంఖ్య, హాజరు, భోజన వసతి గురించి వార్డెన్‌ను అడిగి తెలుసుకున్నారు.

వైభవంగా అయ్యప్ప స్వామి గ్రామోత్సవం

ములకలచెరువు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ములకలచెరువులో అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని కన్నులపండవగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయప్ప స్వామి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి ప్రధాన వీధుల్లో ఊరేగించారు. అయప్పస్వామి భక్తులు పాల్గొన్నారు.

కస్తూరిబా పాఠశాలను తనిఖీ చేసిన సబ్‌కలెక్టర్

బి.కొత్తకోట, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలం పరిధిలోని కస్తూరిబా గురుకుల పాఠశాలను మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో తరగతుల నిర్వహణ తదితర అంశాలపై సిబ్బందిని ఆరా తీశారు. పాఠశాల ఆవరణలో రూ.1.60 కోట్లతో నిర్మాణం పూర్తి చేసుకొని ప్రారంభానికి సిద్ధంగా వున్న ఇంటర్మీడియట్ నూతన భవన సముదాయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ఇకపై ఇంటర్ చదివే బాలికలకు హాస్టల్ వసతి, తరగతులు కూడా ఈ భవనం నుంచే నిర్వహించడం జరుగుతుందన్నారు.

ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా రక్షించండి

గుర్రంకొండ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి):గుర్రంకొండ పట్టణంలో విలువైన ప్రభుత్వ భూములు కబ్జాకు గురి కాకుండా రెవెన్యూ సిబ్బంది పర్యవేక్షిం చాలని రాయచోటి ఆర్డీవో ఏ.శ్రీనివాసు లు పేర్కొన్నారు. గుర్రంకొండ సచివాల యంలో శనివారం రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరై మాట్లాడుతూ ప్రజలు భూముల సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం రైతులు, ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి లక్ష్మీపతి, తహశీల్దార్ శ్రీనివాసులు, నాయకులు జగదీష్, నౌషాద్‌అహ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.



వృద్ధులకు చేయూత నిద్దాం

వాల్మీకిపురం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): సమాజంలో నిరాధార వృద్ధులకు ప్రతి ఒక్కరూ చేయూత నివ్వాలని మండల జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు రెడ్డెప్ప పేర్కొన్నారు. శనివారం పీలేరు జనసేన ఇన్‌ఛార్జి బెజవాడ దినేష్ జన్మదినం సందర్భంగా స్థానిక చౌడేశ్వరిదేవి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు, అన్నదానం చేశారు. నేతలు దేపాని ప్రభాకర్, శివ, వెంకటేష్, శ్రీనివాసులు, మహేష్, వెంకీ, ఆది, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

నిరంతరం ఆదాయం చేకూరే పద్ధతిలో ప్రకృతి వ్యవసాయం

నిమ్మనపల్లి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పకృతి వ్యవసాయంలో నూతన పద్ధతులను పాటిస్తే నిరంతరం ఆదాయం పొందవచ్చని ఏవో మురళి మోహన్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని అగ్రహారం పంచాయతి చెరువుముందరపల్లిలో మహిళా రైతు కమలమ్మ ఏటిమ్ పద్ధతిలో పంటలను పండించేందుకు సన్నాహాలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏటీఎమ్ పద్ధతి అంటే నిత్యం పంటలు పండించి రోజూ ఆదాయం రావడాన్నే ఏటిఏమ్ పద్ధతి అంటారని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు జబ్బార్, పకృతి వ్యవసాయ సహాయకులు సుశీలమ్మ తదితరలు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్గో సర్వీసును ఆదరించండి

పీలేరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): తమ సంస్థ నడుపుతున్న కార్గో సర్వీసులను ఆదరించాలని ఆర్టీసీ పీలేరు డీఎం బండ్ల కుమార్ ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు. డోర్ డెలివరీ మాసోత్సవాలలో భాగంగా శనివారం ఆయన పీలేరు డిపోలోని బస్సుల్లో ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలోని 80 ముఖ్య పట్టణాలలో తమ సర్వీసులు అందుబాటులో ఉన్నాయని, క్రిస్మస్, సంక్రాంతి పండుగల నేపథ్యంలో బంధువులు, స్నేహితులకు పార్శిళ్లు చేయాలనుకునే వారికి 24 గంటల్లో డోర్ డెలివరీ ఇస్తున్నట్లు ఆయన వివరించారు.



ఘనంగా నారా బ్రాహ్మణి జన్మదిన వేడుకలు

ములకలచెరువు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ములకలచెరువులోని పార్టీ కార్యాయంలో శనివారం మంత్రి నారా లోకేశ్ సతీమణి నారా బ్రాహ్మణి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి, ఆయన సతీమణి కల్పనరెడ్డిలు కేక్‌ను కట్‌చేసి నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడు, టీడీపీ జిల్లా కార్యదర్శి ఎర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ కేవీ రమణ, మాజీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కట్టా హరినాధ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామకంఠం భూములను కాపాడాలి

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఆయా గ్రామాల్లో ఉన్న గ్రామకంఠం భూములను కాపాడాల్సిన బాధ్యత పంచాయతీ అధికారులదేనని డీపీవో బాలకృష్ణ పేర్కొన్నారు. శనివారం స్థానిక పీటీఎం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్వేయర్లు, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశమై మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గ్రామాల్లో ఉన్న గ్రామకంఠం భూములను కాపాడి వాటిని పరిరక్షించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. అందులో భాగంగా ఆయా గ్రామాల్లో ఉన్న గ్రామ కంఠం భూములను పంచాయతీ అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి రికార్డులను పరిశీలించి సంబంధిత అనుభవం దారులకు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

ఘనంగా ప్రథమ ధ్యాన దినోత్సవం

పీలేరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ప్రథమ ధ్యాన దినోత్సవాన్ని శనివారం పీలేరులోని 'షీ' దివ్య యోగ విద్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు. స్థానిక వీఎస్‌ఎన్ సిద్ధార్థ విద్యాసంస్థల విద్యార్థులకు ధ్యానం నేర్పించడమే కాకుండా ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. యోగ విద్యాలయం నిర్వాహకురాలు వీవీఎస్ లక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఏడాదీ జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకున్నట్లుగానే డిసెంబరు 21న అంతర్జాతీయ ధ్యాన దినోత్సవంగా జరుపుకోవాలని ఐక్యరాజసమితి ప్రకటించడం హర్షణీయమన్నారు. విద్యాలయం న్యాయసలహాదారులు రాయల సుధాకర్, యోగా మాస్టర్ చంద్రశేఖర్, శోభారాణి పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలి

పెద్దమండ్యం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి) వర్షాభావ పరిస్థితులతో ఖరీఫ్ పంటలు దిగుబడులు లేక రైతన్నలు నిరాశకు గురవడంతో ప్రత్యామ్నాయ పంటలు సాగుచేయాలని అధికారులు సూచిస్తున్నారు. ఆ మేరకు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని ప్రభుత్వం ఉలవ విత్తనాలు రైతన్నలకు పంపిణీ చేసింది. ఈ దిశగా రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకున్నారు. పెద్దమండ్యం మండలంలో 11 వందల ఎకరాల్లో ప్రత్యామ్నాయ పంటల సాగు చేసినట్లు అధికారులు తెలిపారు. మంచుకు పండే పంటగా గుర్తింపు పొందిన ఉలవ ఆశించిన స్థాయిలో దిగుబడులు కనిపిస్తున్నాయి. దీంతో రైతులు ప్రమ్యామ్నాయ పంటల దిగుబడులు కాపాడుకోవడానికి శ్రీకారం చుట్టారు. పెద్దమండ్యం మండలం కలిచెర్ల సమీపంలోని చెందిన రైతులు ఉలవ పంట కాపాడుకోవడానికి ఖరీదైన తెర ఏర్పాటు చేయడం విశేషం. అలాగే కందుల సాగు చేసిన పొలాలకు కంప కంచెలు ఏర్పాటు చేసుకున్నారు. కనీసం ఈ ప్రత్యామ్నాయ పంటలు అధిక దిగుబడులు సాధించాలని రైతులు ఆశిస్తున్నారు.

